మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 12-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 252 Issue: 252

12 మార్చి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:30 సూర్యాస్తమయం - సా. 6:21 తిథి నవమి ఉ. 6:30౦ వరకు తరువాత దశమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం మూల రా. 12:340 వరకు తరువాత పూర్వాషాఢ యోగం సిద్ధి ఉ. 9:51 వరకు కరణం తైతుల సా. 5:25 వరకు గరజి ఉ. 6:30౦ వరకు వర్జ్యం ఉ. 6:54 నుండి ఉ. 8:41 వరకు దుర్ముహూర్తం ఉ. 10:27 నుండి ఉ. 11:14 వరకు మ. 3:11 నుండి మ. 3:59 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:23 వరకు యమగండం ఉ. 6:30 నుండి ఉ. 7:59 వరకు గుళికాకాలం ఉ. 9:28 నుండి ఉ. 10:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:54 నుండి తె. 5:42 వరకు అమృత ఘడియలు సా. 5:40 నుండి రా. 7:27 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:02 నుండి మ. 12:49 వరకు

Published from Jagitial
Circulated to Telangana


# పాపం.. మంచోళ్లు



తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో స్పీకర్ గడ్డం ప్రసాద్ సంచలన తీర్పు వెల్లడించారు. రాజకీయ ఉత్కంఠకు తెరదించుతూ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చిట్ ఇచ్చారు. పార్టీ ఫిరాయింపు కేసులో స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పు వెల్లడించారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలు పార్టీ మారారు అనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ ప్రకటించారు.

## దానం, కడియంకు స్పీకర్ క్లీన్ చిట్

### పార్టీ మారారనటానికి ఆధారాల్లేవ్.. ఇద్దరిపై బీఆర్ఎస్ పిటిషన్లు డిస్మిస్

### మొత్తంగా 10 మంది ఎమ్మెల్యేలకు ఊరట

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): అనంతరం, ఇద్దరిపై వేసిన రెండు పిటిషన్లకు డిస్మిస్ చేశారు. దీంతో ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇంతటితో స్పీకర్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుకు తెరపడింది. కాగా, పార్టీ ఫిరాయింపుల కేసులో ఇప్పటికే ఈ కేసులో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మార్చి 12లోగా ఫిరాయింపు కేసులో ఏదో ఒకటి తేల్చాలని గతంలో సుప్రీంకోర్టు గడువు విధించింది. సుప్రీంకోర్టు డెడ్ లైన్ నేపథ్యంలో బుధవారం స్పీకర్ తీర్పును వెల్లడించారు. మరోవైపు.. తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తరువాయి 2 వ పేజీలో...

# దొంగ.. దొర




## ముసుగేసుకున్న ప్రజాస్వామ్యం

### ఆధారాల్లేవనడం అత్యంత దుర్దినం

### స్పీకర్ నిర్ణయంపై రాజకీయ విమర్శలు

తెలంగాణ రాజకీయ యవనికపై ఒక వికృత క్రీడ సాగుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నాడు దొరల పాలన అంతం కావాలని నినదించిన గొంతులే, నేడు అదే దొరతనాన్ని పార్టీ ఫిరాయింపుల రూపంలో పునరుద్ధరిస్తున్నాయని చెప్తున్నారు.

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి కండువాలు కప్పడం యావత్ రాష్ట్రం చూసిందని, కానీ, స్పీకర్ కంటికి మాత్రం ఆ దృశ్యాలు ఆనకపోవడం విచారకరం అని అంటున్నారు. 'ఆధారాలు లేవు అనే సాకుతో అనర్హత పిటిషన్లను కొట్టివేయడం ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేయడమే. ఒక ఎమ్మెల్యే ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీ కండువా కప్పుకున్నా -2 వ పేజీలో...



## హన్సికకు విడాకులు

బాంద్రా ఫ్యామిలీ కోర్టు మంజూరు

భరణం లేకుండానే డివోర్స్

..వివరాలు 'వినోదవాణి' పేజీలో..

## ఐపీఎల్ షెడ్యూల్ రిలీజ్

ఎన్నికల నేపథ్యంలో రెండు విడతలు

తాజాగా తొలి విడత విడుదల

తొలి పోరు ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్

.. వివరాలు 'క్రీడావాణి' పేజీలో..

# రైతన్నా.. నీకూ పవర్!

### తెలంగాణలో మూడో విద్యుత్ డిస్కం ఏర్పాటు.. వ్యవసాయం, ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పర్యవేక్షణ



తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటు చేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్‌పీడీసీఎల్)ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా జీవో విడుదల చేసింది. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లతో పాటు ఈ కొత్త టీజీఆర్‌పీడీసీఎల్ డిస్కమ్ కూడా సేవలు అందించనుంది. అయితే ఈ మూడో కొత్త డిస్కమ్ రాష్ట్రంలోని వ్యవసాయం, ఎత్తిపోతల పథకాల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ సహా మిగిలిన వాటి విద్యుత్ అవసరాలను తీర్చనుంది.

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): తెలంగాణలో ఇప్పటికే ఉన్న 2 విద్యుత్ పంపిణీ సంస్థలకు అదనంగా మూడో డిస్కంను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన ఈ డిస్కం బాధ్యతలను సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీకి అప్పగించింది. ఈ నేపథ్యంలోనే టీజీఆర్‌పీడీసీఎల్ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫరూఖీని నియమించింది. ఇక టీజీఆర్‌పీడీసీఎల్ కార్యకలాపాల పర్యవేక్షణకు ఛైర్మన్‌తోపాటు మరో నలుగురు డైరెక్టర్లను కూడా నియమించారు. ఈ కొత్త డిస్కం టీజీఆర్‌పీడీసీఎల్ కేవలం సాధారణ విద్యుత్ పంపిణీ చేయడం మాత్రమే కాకుండా.. వ్యవసాయం, ప్రజా అవసరాలకు సంబంధించిన విద్యుత్ సరఫరాను పర్యవేక్షించనుంది. రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మెయింటెనెన్స్, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనుంది. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయనుంది. తెలంగాణలోని భారీ, మధ్యతరహా ఎత్తిపోతల ప్రాజెక్టులకు ఈ టీజీఆర్‌పీడీసీఎల్ విద్యుత్ సరఫరా చేయనుంది. మిషన్ భగీరథ, మున్సిపల్ వాటర్ సప్లై పథకం, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను పర్యవేక్షించనుంది. వ్యవసాయం, భారీ నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన విద్యుత్ సరఫరాను.. సాధారణ విద్యుత్ వినియోగదారులు, పరిశ్రమల విద్యుత్ అవసరాల నుంచి వేరు చేసి.. వేర్వేరు డిస్కమ్‌లకు తరువాయి 2 వ పేజీలో...



# ఛలో మహిళా.. చట్టసభలకు!

### 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా కేంద్రం

### రాజ్యాంగ సవరణ ద్వారా అమలు యోచన

### నియోజకవర్గాల పునర్విభజనకు ముందే అమలు!

మహిళా రిజర్వేషన్లపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందే 33 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు 2023లో పార్లమెంట్ ఆమోదించిన చట్టంలో సవరణలు చేయాలని భావిస్తోంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా ప్రస్తుత సమావేశాల్లోనే రాజ్యాంగ సవరణకు సిద్ధమైంది.

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల పైన బడ్జెట్ మలి విడత సమావేశాల్లో రాజ్యాంగ సవరణ ద్వారా అమలుచేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందే మహిళా రిజర్వేషన్ చట్టం అమలు చేసే అవకాశాలు -2 వ పేజీలో...



## బంగారం- వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.16,331 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,459 |

## విశ్వవాణి



భూమి కింద కోట్ల టన్నుల సహజసిద్ధ హైడ్రోజన్ రిజర్వులు ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. అది వెలికితీస్తే వెయ్యేళ్ల వరకు కరెంటును సరఫరా చేయవచ్చని భావిస్తున్నారు.

# భారత నౌకపై దాడి

### హర్మూజ్ వద్ద ఘటన.. ముగ్గురు భారతీయులు గల్లంతు.. ఇరాన్ పనేనని అనుమానాలు?




టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి ముదిరాయి. యూఏఈ నుంచి భారత్‌కు వస్తున్న ఒక భారీ కార్గో నౌకపై హర్మూజ్ జలసంధి సమీపంలో దాడి జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు నావికులు గల్లంతవ్వగా, నౌక తీవ్రంగా దెబ్బతిన్నది. థాయ్‌లాండ్ షిప్పింగ్ కంపెనీకి చెందిన 'మయూరీ నారీ' కార్గో నౌక, యూఏఈలోని ఖలీఫా పోర్ట్ నుంచి గుజరాత్‌లోని కాండ్లా పోర్ట్‌కు బయల్దేరింది. హర్మూజ్ జలసంధి మీదుగా తరువాయి 2 వ పేజీలో...



## గవర్నర్‌గా శుక్లా ప్రమాణం

ఆసక్తికరంగా తెలుగులో ప్రమాణం



# అయోధ్యలో అన్నదానం బంద్

### అమవా ఆలయంలోని కేంద్రం తాత్కాలికంగా మూసివేత

### వంట గ్యాస్ అందుబాటులో లేదని వెల్లడి

అయోధ్య: పశ్చిమాసియా దేశాల్లోని ఉద్రిక్తతల కారణంగా మన దేశంలో వంటగ్యాస్ కొరత తీవ్రమవుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రభావం అయోధ్యను కూడా తాకింది. ఎల్పీజీ సిలిండర్ల కొరత కారణంగా అయోధ్య, రాంనగరి అమవా ఆలయంలోని రామ్ రసోయి అన్నదాన కేంద్రంను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు అన్నదాన కేంద్రం వద్ద నోటీసులు అంటించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున కమ్యూనిటీ కిచెన్ అందుబాటులో లేదని అక్కడకు వచ్చిన తరువాయి 2 వ పేజీలో...

# ఇండేన్ బుకింగ్ సిస్టమ్ క్రాష్

### 10 రెట్లు పెరిగిన బుకింగ్ కాల్స్.. దెబ్బకు మొరాయించిన సర్వర్లు

న్యూఢిల్లీ: ఎల్‌పీజీ గ్యాస్ సంక్షోభం వార్తల వేళ ఇండేన్ బుకింగ్ సిస్టమ్ ఒక్కసారిగా కుప్పకూలింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత వస్తుందన్న భయంతో వినియోగదారులు భారీగా రీఫిల్ బుకింగ్స్ చేస్తుండటమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే బుకింగ్ కాల్స్ సంఖ్య ఒక్కసారిగా 8 నుంచి10 రెట్లు పెరగడంతో ఇండేన్ ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్స్ ఓవర్‌లోడ్ అయ్యి మొరాయించాయి. బుధవారం ఉదయం నుంచే వినియోగదారులు ఫోన్ ద్వారా లేదా యాప్ ద్వారా బుక్ చేయడానికి ప్రయత్నించగా, సిస్టమ్ స్పందించకపోవడంతో వేలాది మంది తరువాయి 2 వ పేజీలో...



# రెండున్నర రోజుల్లో సిలిండర్ డెలివరీ

### వినియోగదారులకు కేంద్రం గుడ్ న్యూస్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై వస్తున్న వార్తలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. సామాన్యులకు ఊరటనిస్తూ గ్యాస్ సరఫరా, డెలివరీ విషయంలో కీలక నిర్ణయాలను ప్రకటించింది. ఇకపై సిలిండర్ కోసం వారాల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదని, బుకింగ్ చేసిన రెండున్నర రోజుల్లోనే సిలిండర్ ఇంటికి చేరుతుందని స్పష్టం చేసింది. దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎల్పీజీ ఉత్పత్తిని ఏకంగా 25 శాతం పెంచినట్లుగా తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు



12.3.2026

మేషం: బంధు మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. చేపట్టిన కార్యక్రమాలలో అవాంతరాలు కలుగుతాయి. దూర ప్రయాణాల వలన శారీరక శ్రమపెరుగుతుంది. ఉద్యోగస్తులకు పనిభారం అధికమవుతుంది.

వృషభం: ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ వాతావరణం చికాకుగా ఉ ంటుంది. వృత్తి వ్యాపారాలలో కష్టానికి ఫలితం కనిపించదు. ఉద్యోగులకు నూతన బాధ్యతల వలన శిరోభాధలు అధికమౌతాయి. సంతాన విద్యా విషయాలలో దృష్టి సారించడం మంచిది.

మిధునం: వ్యాపారాలు విస్తరించి నూతన లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో దూరప్రయాణాలు చేస్తారు. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. జీవిత భాగస్వామితో ఆలయాలు దర్శిస్తారు. ఆకస్మిక ధనలబ్ధి పొందుతారు. ఉద్యోగస్తులు అదనపు పనిఒత్తిడి నుండి బయటపడతారు.

కర్కాటకం: ఒక వ్యవహారంలో బంధువులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయాలు తీసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరిగి నూతన ఋణాలు చేస్తారు. ఉ ద్యోగ వాతావరణం మందకొడిగా సాగుతుంది. దూరప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

సింహం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉ ద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అవసరాలకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

కన్య: చిన్ననాటి మిత్రులతో వివాదాలు కలుగుతాయి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. చేపట్టిన కార్యక్రమాలలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉ ద్యోగస్తులకు నూతన బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు.

తుల: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. వ్యాపారపరంగా నూతన లాభాలు అందుతాయి. నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి.

వృశ్చికం: బంధు మిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. నూతన వాహన యోగం ఉన్నది ధన వ్యవహారాలు కలిసివస్తాయి.

ధనస్సు: చేపట్టిన పనులు ముందుకు సాగవు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ పెద్దల అనారోగ్య సమస్యలు మానసికంగా భాదిస్తాయి. బంధుమిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టాలను ఎదుర్కొంటారు. ఉ ద్యోగస్తులకు అధికారులతో చర్చలు కలసిరావు.

మకరం: ఉద్యోగస్తులకు స్థానచలన సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభించదు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

కుంభం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగ వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

మీనం: సోదరుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.ఉద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

# పాపం మంచోళ్లు





**మొదటి పేజీ తరువాయి**

కడియం శ్రీహరి స్పీకర్‌కు చెప్పడం కొసమెరుపు. ఈ నేపథ్యంలో స్పీకర్ తీర్పుపై పిటిషనర్లు మరోసారి కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్టు సమాచారం. స్పీకర్ తీరుపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందిస్తూ..'స్పీకర్ తీర్పును స్వాగతిస్తున్నాను. పార్టీ ఫిరాయిస్తే షోకాజ్ నోటీసులు ఇవ్వాలి. కానీ, నాకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇవ్వలేదు' అని తెలిపారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. 'స్పీకర్ పరిధిలో నేను ఏ తప్పు చేయలేదు. కేసీఆర్ అంటే అపారమైన గౌరవం ఉంది. నన్ను కేసీఆర్ ప్రశ్నించాలి. కౌశిక్ రెడ్డికి ఏం సంబంధం? అసెంబ్లీలో బీఆర్ఎస్ నాకు ఎలాంటి విప్ జారీ చేయలేదు. కేసీఆర్ నన్ను వివరణ అడగలేదు. నేను బీఆర్ఎస్ మెంబర్‌షిప్ వదులుకోలేదు. ఎక్కడా తీసుకోలేదు' అని పేర్కొన్నారు.

### నేడు సుప్రీం కోర్టులో విచారణ

పార్టీ ఫిరాయింపుల వ్యవహారం అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లను గురువారం సుప్రీంకోర్టు విచారించనుంది. గత కొంతకాలంగా సాగుతున్న ఈ రాజకీయ న్యాయపోరాటం ఇప్పుడు కీలక దశకు చేరుకోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విచారణకు ముందు రోజు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఫలితం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తుందా? లేదా? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ఫిరాయింపుల నిరోధక చట్టం ఈ విషయంలో ఎలా వర్తిస్తుందో ధర్మాసనం విశ్లేషించనుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేస్తుందా? లేక స్పీకర్ నిర్ణయంపై పునఃసమీక్షకు ఆదేశిస్తుందా? అనే చర్చ మొదలైంది. ధర్మాసనం వెల్లడించే తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసే అవకాశం ఉంది.

# దొంగ.. దొర

**మొదటి పేజీ తరువాయి**

అది ఫిరాయింపు కాదని చెప్పడం ప్రజల తీర్పును వెక్కిరించడమే. ముఖ్యంగా దానం నాగేందర్ లాంటి నేతలు కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసి, ప్రచార పర్వంలో పాల్గొన్నా, ఆయన పార్టీ మారలేదని స్పీకర్ తీర్పు ఇవ్వడం దేశ రాజకీయ చరిత్రలో అత్యంత దుర్దినం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వారు చట్టంలోని లొసుగులను వాడుకుని ఫిరాయింపుదారులను దొరలుగా మార్చడం వ్యవస్థల పతనాన్ని సూచిస్తోంది. సుప్రీంకోర్టు, హైకోర్టులు పదేపదే హెచ్చరించినా, గడువు విధించినా కాలయాపన చేసి చివరి నిమిషంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫిరాయింపులను తప్పుబట్టిన వారే, నేడు అదే బాటలో నడుస్తూ తామేమీ తక్కువ కాదని నిరూపించుకుంటున్నారు. చట్టాలు చుట్టాలుగా మారి, స్పీకర్ కార్యాలయం అధికార పార్టీకి అనుబంధ విభాగంగా మారినప్పుడు ప్రజలే అంతిమ తీర్పు చెప్పాల్సి ఉంటుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దొరల్లా అధికారాన్ని అనుభవిస్తూ తిరుగుతుండవచ్చు, కానీ ప్రజాక్షేత్రంలోకి వెళ్లినప్పుడు ఓటరు ఇచ్చే తీర్పు వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓట్లు వేయించుకోవడం కాదు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం. ఆ నమ్మకాన్ని తుంగలో తొక్కిన ఏ వ్యవస్థకైనా, ఏ నేతకైనా కాలం తప్పక సమాధానం చెప్తుంది' అని హెచ్చరిస్తున్నారు. రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకొని తిరగడం కాదని పేర్కొంటున్నారు.

### 10 మందికి క్లీన్ చిట్ ఇలా..

డిసెంబర్ 2025లో: తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), టి. ప్రకాష్ గౌడ్ (రాజేంద్రనగర్), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి)

జనవరి 2026: కాలె యాదయ్య (చేవెళ్ల), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ)

ఫిబ్రవరి 2026: డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల)

మార్చి 11 2026: దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్)

# రెండున్నర రోజుల్లో సిలిండర్ డెలివరీ



**మొదటి పేజీ తరువాయి**

కేంద్రం పేర్కొంది. దీంతో సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగదని పేర్కొంది. దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడిందని రాబోయే రోజుల్లో ఈ కొరత మరింత పెరిగే అవకాశం ఉంది అని ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్యాస్ కొరత తీవ్రంగా ఉంటుందనే భయంతో గ్యాస్ బుకింగ్ చేసుకుంటున్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా గ్యాస్ బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ బుకింగ్‌లు విరీతంగా పెరిగాయి. ప్రజల భయాందోళనలను పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం బుధవారం కీలక ప్రకటన చేసింది. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ఎలాంటి భయాందోళనలు వద్దు అని కేంద్ర ప్రకటించింది. అనవసరంగా గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేయవద్దని సూచించింది. దేశంలో తగినంత ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో రోజుకు దాదాపు 55 లక్షల బ్యారెళ్ల ముడి చమురు అందుబాటులో ఉన్నదని ఓ ప్రభుత్వ అధికారి తెలిపారు. హర్మూజ్ జలసంధి ద్వారా వచ్చే దానికంటే ఎక్కువగా చమురు, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని వెల్లడించారు.



# ఛలో మహిళా.. చట్టసభలకు!

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నాయి. ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్న బడ్జెట్ మలి విడత సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. జనగణన, పునర్విభజన ప్రక్రియ కోసం వేచి చూడకుండానే కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ బిల్లు అమల్లోకి వస్తే చట్ట సభల్లో మహిళా సభ్యుల సంఖ్య 180 స్థానాలకు పెరుగుతుందని చెప్తున్నారు. రాజ్యసభలో మొత్తం 224 ఎంపీలు ఉన్నారు. వీరిలో 24 మంది మహిళా ఎంపీలు ఉన్నారు. అంటే ప్రస్తుతం మహిళా ఎంపీల శాతం 11 శాతంగా ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు సీట్లు

మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం ఇక అసెంబ్లీ, లోక్‌సభలో తప్పనిసరిగా 33 శాతం సీట్లు మహిళలకే కేటాయించాలి. ఈ చట్టం అమల్లోకి వస్తే తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లు ఉండగా, వీటిలో 40 సీట్లు మహిళలకు వస్తాయి. అలాగే తెలంగాణలో 17 లోక్‌సభ సీట్లు అంటే సుమారు 5-6 సీట్లు మహిళలకు కేటాయించాల్సి ఉ ంటుంది. ఏపీలో 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 57- 58 సీట్లు మహిళలకు దక్కనున్నాయి. ఏపీలో 25 లోక్ సభ సీట్లు ఉండగా, 8 సీట్లు మహిళలకు కేటాయించే అవకాశం ఉంది. అయితే.. నియోజకవర్గ పునర్విభజన జరిగితే తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 స్థానాలు మరో 34 పెరిగి 153 స్థానాలు అవుతాయి. అదే విధంగా ఏపీలో 50 సీట్లు పెరిగి 225 కి చేరుతాయి. పెరిగిన లెక్కల మేరకు మహిళల రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలపై నిర్ణయం జరిగినా.. ఆలస్యం అయినా.. మహిళలకు రిజర్వేషన్ సీట్ల ఖరారు మాత్రం ఇక నుంచి జరిగే అన్ని ఎన్నికల్లోనూ అమలయ్యేలా కేంద్రం కొత్త చట్టం అమల్లోకి తెచ్చేందుకు తుది కసరత్తు చేస్తోంది.

# ఇండేన్ బుకింగ్ సిస్టమ్ క్రాష్

**మొదటి పేజీ తరువాయి**

ఇబ్బందులు పడ్డారు. గ్యాస్ సరఫరా నిలిచిపోతుందనే ప్రచారంతో వినియోగదారులు ముందస్తుగా సిలిండర్లను బుక్ చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. ఈ పానిక్ బుకింగ్ వల్ల వెబ్‌సైట్, సర్వర్లపై తీవ్ర ఒత్తిడి పడింది. సిస్టమ్ క్రాష్ అయినప్పటికీ.. వాట్సాప్, ఇండియన్ ఆయిల్ వన్ యాప్ ద్వారా ప్రయత్నించాలని, రాత్రి 10 గంటల తర్వాత బుకింగ్స్ సులభంగా అయ్యే అవకాశం ఉందని సంస్థ సూచించింది.

# రైతన్నా.. నీకూ పవర్!

**మొదటి పేజీ తరువాయి**

అప్పగించడం ద్వారా విద్యుత్ సరఫరాను మరింత మెరుగ్గా నిర్వహించవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నిర్ణయం వల్ల రైతులకు విద్యుత్ కోతలు లేకుండా వారికి వచ్చే సమస్యలను పరిష్కారించే అవకాశం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద సంస్కరణల్లో ఈ నిర్ణయం ఒకటిగా నిలవనుంది.

# ..అన్నదానం బంద్

**మొదటి పేజీ తరువాయి**

భక్తులు చెబుతున్నారు. దైవ దర్శనం కోసం వచ్చానని, ఆ తర్వాత రామ్ రసోయిలో అన్నదానం చేస్తారని తెలిసి వచ్చానని, కానీ వంట గ్యాస్ కొరత కారణంగా భోజనం తయారు చేయడం లేదని ఒక భక్తుడు తెలిపాడు. మంగళ వారం మధ్యాహ్నం నుంచి ఈ సమస్య తలెత్తిందని ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి వంట గ్యాస్ సమస్య ఉ ందని తెలిసిందని పేర్కొన్నారు.



# గవర్నర్‌గా శుక్లా ప్రమాణం

## ఆసక్తికరంగా తెలుగులో ప్రమాణం

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌భవన్ వేదికగా గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. శివ్ ప్రతాప్ శుక్లా తెలుగులో ప్రమాణస్వీకారం చేయడం విశేషం. గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్, మంత్రులు, మండలి చైర్మన్ హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శివ్ ప్రతాప్ శుక్లా తన సందేశం ఇచ్చారు. 'తెలంగాణ ప్రజలకు సేవ చేయడం గర్వంగా భావిస్తున్నాను. రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు. తెలంగాణ సాంస్కృతిక సంపద, గొప్ప సంప్రదాయాల రాష్ట్రం. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడుతుంది. తెలంగాణ ఆశలు, ఆవిష్కరణలు, సహనశక్తికి ప్రతీక. ప్రజల దీక్షతో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా సాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, కేబినెట్‌కు అభినందనలు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ లక్ష్యాలతో ముందుకు సాగుదాం. సమైక్యత, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటాను. రాజ్యాంగానికి అనుగుణంగా నిజాయితీగా విధులు నిర్వహిస్తాను. సుసంపన్నమైన తెలంగాణ కోసం కలిసి పని చేద్దాం' అని గవర్నర్ పేర్కొన్నారు.

# భారత నౌకపై దాడి

**మొదటి పేజీ తరువాయి**

ప్రయాణిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ నౌకపై దాడికి పాల్పడ్డారు. దాడి ధాటికి నౌక నుంచి దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలను రాయల్ థాయ్ నేవీ విడుదల చేసింది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 23 మంది సిబ్బంది ఉండగా, ఒమన్ నౌకాదళం సకాలంలో స్పందించి 20 మందిని సురక్షితంగా రక్షించింది. అయితే, మిగిలిన ముగ్గురు నావికులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దాడికి ఏ ఉ గ్రవాద సంస్థ లేదా దేశం అధికారికంగా బాధ్యత ప్రకటించలేదు. అయితే, ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాలతో ఇరాన్‌కు యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ఈ దాడి ఇరాన్ దళాలే చేసి ఉండవచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించే నౌకలకు రక్షణగా అమెరికా నౌకాదళాన్ని పంపిస్తామని ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత ఈ దాడులు పెరగడం గమనార్హం.

దాడిని తీవ్రంగా ఖండించిన భారత్

వాణిజ్య నౌకపై దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. 'వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం విచారకరం' అని.. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. 'భారత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తున్న థాయ్‌లాండ్ ఆయిల్ ట్యాంకర్ నౌక మయూరీ నారీపై హర్మూజ్ జల సంధిలో మార్చి 11న దాడి జరిగిందనే నివేదికలను మేము గమనించాం.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సైనిక ఘర్షణల్లో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని భారత్ ఖండిస్తోంది.. ఈ సంఘర్షణ తొలి దశలో జరిగిన అనేక దాడుల్లో భారతీయ పౌరులతో సహా విలువైన ప్రాణాలను ఇప్పటికే కోల్పోయారు.. దాడుల తీవ్రత, ప్రాణభయం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది' అని ప్రకటన విడుదల చేసింది.



# టీబీకి ఇంజెక్షన్ ఉందా?


**లేనేలేదంటున్న ప్రముఖ వైద్యులు**

**మోసపోవద్దని రోగులకు సూచనలు**

**'నో స్మోకింగ్'పై పీఐబీ వార్తా వర్క్‌షాప్**



హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): టీబీ(క్షయ వ్యాధి)ని వారంలో నయం చేస్తాం.. నెలలో నయం చేస్తాం.. ఇంజెక్షన్ ఇస్తే అంతా తగ్గిపోతుంది.. లాంటి మాటలు మోసపూరితమైనవని ప్రముఖ వైద్యులు చెప్తున్నారు. కొన్ని ఆస్పత్రులు సంపాదన ఆర్జనే ధ్యేయంగా చేసే ఇలాంటి చికిత్సల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. 'నో స్మోకింగ్ డే(ధూమపాన రహిత దినోత్సవం)' సందర్భంగా బుధవారం కవాడిగూడలోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ)లో మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ కారకాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్సలు, చికిత్స సమయం తదితర అంశాలపై ప్రముఖ వైద్యులు అవగాహన కల్పించారు. పీఐబీ–హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్వో) కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ, జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్‌టీఈపీ) ఐఈసీ అధికారి శ్రీ ఎస్ జితేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీగణ మాట్లాడుతూ.. పొగాకు వినియోగం వల్ల క్షయ సహా అనేక వ్యాధుల ముప్పు పెరుగుతుందని, శరీరంలోని కీలక అవయవాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. క్షయ వ్యాధికి పొగాకు వినియోగం ఆజ్యం పోస్తోందని, క్షయ బాధితుల్లో 8 శాతం మంది పొగాకు అలవాటు ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయని గుర్తుచేశారు. ధూమపానం, మద్యపానం, అతిగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోయి, త్వరగా వ్యాధుల బారిన పడతారని తెలిపారు. పొగాకు వ్యసనాన్ని మానుకోవాలనుకునే వారు నేషనల్ టొబాకో క్విట్‌లైన్ సర్వీసు టోల్ ఫ్రీ నెంబరు 1800 112 356కు ఫోన్ చేసి, సలహాలు పొందొచ్చని సూచించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్‌టీఈపీ) ఐఈసీ అధికారి ఎస్ జితేంద్ర మాట్లాడుతూ.. ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం సమాజానికే నష్టమని అన్నారు. ధూమపానం చేసే వారి ఆరోగ్యానికి ఎంత నష్టమో, ఆ పొగను పీల్చే ఇతరుల ఆరోగ్యానికి కూడా అంతే నష్టమని పేర్కొన్నారు. పొగాకు వాడేవారిలో క్షయవ్యాధి ముప్పు కూడా ఎక్కువ అని అన్నారు. క్షయవ్యాధి పట్ల సమాజంలో ఉన్న దురభిప్రాయం, వ్యాపిస్తున్న తప్పుడు సమాచారాన్ని తగ్గించేందుకు మీడియా కృషి చేయాలని కోరారు. పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ... పొగాకు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని, వినియోగంలో రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. పొగాకు వ్యసనాన్ని తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం(ఎన్‌టీసీపీ) చేపట్టిందని, సీఓటీపీ చట్టం చేసిందని గుర్తుచేశారు. ధూమపానం వంటి వ్యసనాలను నివారించడానికి ప్రజాభాగస్వామ్యం కీలకమని, ఇందుకోసం అవగాహన కల్పించడానికి మీడియా కృషి చేయాలని కోరారు. పీఐబీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ... చైనా తర్వాత ధూమపానం చేసే వారు భారత్‌లోనే ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో 28% మంది ధూమపానం చేస్తుండగా, పరోక్ష ధూమపాన ప్రభావం 42% మందిపై ఉంటోందని గణాంకాలు చెప్తున్నాయని అన్నారు. ధూమపానం, పొగాకు వినియోగం భవిష్యత్తుకు ప్రమాదంగా మారుతోందని అన్నారు. వీటి నివారణకు కేంద్రం నషా ముక్త్ భారత్ చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పొగాకు నిర్మూలన స్వచ్ఛంద కార్యకర్త, టొబాకో కంట్రోల్ హీరో అవార్డుగ్రహీత మాచన రఘునందన్ మాట్లాడుతూ.. ధూమపానం నిర్మూలనలో సమాజంలోకి ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వెలుగుమట్లలో మోడల్ కాలనీ



**డిసెంబర్ 9న సీఎం చేతులమీదుగా గృహప్రవేశం**

**రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు మా ప్రభుత్వ లక్ష్యం**

**భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటితో కలిసి ఇళ్ల పట్టాల పంపిణీ**

ఖమ్మం, మార్చి 11 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా కేంద్రంలోని వెలుగుమట్లలో పేదల కోసం మోడల్ కాలనీ నిర్మిస్తాం, దేశంలోని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసే విధంగా మోడల్ కాలనీ ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వెలుగుమట్లలో పేదలకు పంచగా మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి ఉపయోగిస్తామని అన్నారు. భూదాన్ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాదు కరెంటు, నీళ్లు, రోడ్లు, ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి డిసెంబర్ 9 కల్లా మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను, ముగ్గురు మంత్రులం (భట్టి, పొంగులేటి, తుమ్మల) కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తాం డిసెంబర్ 9 కల్లా నిర్మాణం పూర్తి చేయాలి పాలు పొంగించాలి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు జరగాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇది పేదల పక్షాన మాకు ఉన్న నిబద్ధత అన్నారు. ఇల్లు కట్టిస్తామని పది సంవత్సరాలపాటు పరిపాలించిన వారు చెప్పిన మాటలు నమ్మి చూసి చూసి పేదల కళ్ళు కాషాయని, వారు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అలాంటి వారికి మా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. ఈ రాష్ట్రంలో జీవించే ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి అనేది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఆలోచన అన్నారు. ఆ ఆలోచనలో భాగంగానే రాష్ట్రంలో పేదవారి కోసం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు 22,500 కోట్లు ఒకేసారి మంజూరు చేసి చేసే చరిత్రలోనే రికార్డు సృష్టించిన ప్రభుత్వం తమది అనే డిప్యూటీ సీఎం తెలిపారు. ఇలాంటి ప్రభుత్వంపై కావాలని పేదలకు మేలు జరగవద్దని కొద్దిమంది బురద జల్లుతున్నారు అని డిప్యూటీ సీఎం ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాలుగా మాఫియా వెలుగుమట్లలో పేదల నుంచి డబ్బులు వసూలు చేసింది వారికి కనీస సౌకర్యాలు లేకుండా సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసింది, పేదలు ఆత్మగౌరవంతో బతికేలా చేయాలని వెలుగుమట్లలో అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టింది అన్నారు. పేదలు చట్టబద్ధంగా న్యాయబద్ధంగా ఆత్మ గౌరవంగా బతికేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు ప్రజా ప్రభుత్వం వెనుకాడదని తెలిపారు. వెలుగుమట్లలో అర్హత కలిగిన 412 మందిని గుర్తించి తన తమ భేదం లేకుండా జిల్లా పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో ఉన్న 101 మంది పేదలకు వారి గ్రామాల్లో ఉన్న స్థలాల్లో ఇందిరమ్మ నిర్మాణానికి అనుమతి పత్రాలు మంజూరు చేసినట్టు తెలిపారు. పేదల నిస్సహాయతను అడ్డుపెట్టుకొని బతికే మాఫియా శక్తులను దరిదాపుల్లోకి రానివ్వద్దని పేదలకు, అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

## బీఆర్ఎస్‌లోనే ఉన్నాం కానీ..: కడియం శ్రీహరి

స్టేషన్ ఘనపూర్, మార్చి 11 (ఈవార్తలు): తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని, కానీ ఆ పార్టీ నాయకత్వానికి దూరంగా ఉన్నామని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పును స్వాగతిస్తున్నానని అన్నారు. తమకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనకు ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని వెల్లడించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ ప్రజల ముందుకు వచ్చి పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడలేదని తెలిపారు. శాసన సభలో మేం ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నప్పటికీ, నాయకత్వానికి మాత్రమే దూరంగా ఉన్నట్లు తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తీసుకున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే ఎక్కువగా కేసీఆర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫిరాయింపుల విషయంలో గతంలో తప్పు చేశానని కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడటంతో పాటు కొందరిని మంత్రులుగా కూడా చేశారని తెలిపారు. తాము పార్టీని ఫిరాయించింది నిజమే అయితే బీఆర్ఎస్ పార్టీ తమకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్టీ పరంగా కూడా తమపై ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. మా వేతనం నుంచి ప్రతి నెల రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి జమ అవుతున్నాయని వెల్లడించారు.

## నేను కాంగ్రెస్ సభ్యత్వమే తీసుకోలేదు

**కేటీఆర్ వ్యాఖ్యలకు దానం కౌంటర్**

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు రాజకీయ దుమారం రేపుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తనపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇవ్వడంపై స్పందిస్తూ, తాను ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి పదవి పోయిందని కేసీఆర్ కంటే కేటీఆరే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పదవి తమ ఆస్తి అని కొందరు భ్రమపడుతున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంత ప్రయత్నించినా సీఎంను డీమోరలైజ్ చేయడం వారి వల్ల కాదు" అని దానం ఎద్దేవా చేశారు. అసలు నిన్న జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశానికి తనను ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. తాను కేవలం పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేశానని, ఎక్కడా అధికారికంగా కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని దానం వెల్లడించారు. శాసనసభలో పార్టీ విప్‌ను ఎప్పుడూ ఉల్లంఘించలేదని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేదని గుర్తు చేశారు. ఒకవేళ స్పీకర్ తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినా, యుద్ధ రంగం నుండి వచ్చిన వాడిలా ఉప ఎన్నికల్లో గెలిచి చూపేవాడినని ధీమా వ్యక్తం చేశారు. తాను సికింద్రాబాద్ ఎంపీగా ఓడిపోవడానికి బీఆర్ఎస్, బీజేపీల అపవిత్ర కలయికే కారణమని ఆయన ఆరోపించారు. ఒకవేళ తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ వివాదమే ఉండేది కాదన్నారు. ఖైరతాబాద్ ప్రజల సైనికుడిగా పనిచేస్తానని, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ ఆశించినట్టే ఫలితాలు ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం వ్యక్తిగత స్వార్థం కోసమే ప్రతిపక్షాలు సీఎంపై బురద చల్లుతున్నాయని మండిపడ్డారు.

## టీజీవాసులకు శాపంగా గల్ఫ్ ఉద్రిక్తతలు

**మాజీమంత్రి హరీశ్ రావు ఆవేదన**

సంగారెడ్డి, మార్చి 11 (ఈవార్తలు): గల్ఫ్ దేశాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ముప్పుగా మారడమే కాకుండా, అక్కడున్న భారతీయులు, తెలంగాణ వాసుల పాలిట శాపంగా మారాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, యుద్ధ క్షేత్రంలో నిరపరాధులైన చిన్నపిల్లలు, సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ అశాంతి త్వరగా ముగిసి అంతటా శాంతి వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో జీవనోపాధి పొందుతున్న భారతీయులు, అందునా తెలంగాణ వాసులు ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. యుద్ధం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు.

టీజీ డీజీపీ ఎవరు?

ఎంపికపై ఢిల్లీలో యూపీఎస్సీ కమిటీ భేటీ

హాజరైన సీఎస్ రామకృష్ణా రావు

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): రాష్ట్రానికి పూర్తి స్థాయి డీజీపీ ఎంపిక ప్రక్రియపై దేశ రాజధాని ఢిల్లీలో యూపీఎస్సీ ఎంప్యానెల్ కమిటీ బుధవారం సమావేశమైంది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు హాజరయ్యారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను కమిటీ పరిశీలించింది. ఈ జాబితా నుంచి ముగ్గురు పేర్లను షార్ట్‌లిస్ట్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తో పాటు వినాయక ప్రభాకర్ ఆప్టే, శిఖా గోయల్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లుగా తెలుస్తుంది. వీరిలో ఒకరిని డీజీపీగా ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శలు

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ స్పందించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు. ఈ ఎమ్మెల్యేలపై విచారణ పేరుతో కాలం వెళ్లబుచ్చి, ఇప్పుడు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు చందంగా క్లీన్ చిట్ ఇచ్చారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని గత కొంతకాలంగా పార్టీ ఫిరాయింపులకు ఒక ప్రయోగశాలగా మార్చారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పార్టీ కండువాలు కప్పారని, కానీ ఇప్పుడు మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. నైతిక విలువలకు, ప్రజాతీర్పుకు గౌరవం ఇచ్చే పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోతామని తెలిసి కూడా నాడు వాజపేయి ప్రభుత్వం ఫిరాయింపులను ప్రోత్సహించలేదని అన్నారు. తెలంగాణలోని ఫిరాయింపులపై ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి రాజ్యాంగమే నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో నీతులు చెప్పే రాహుల్ గాంధీ, తెలంగాణలో వారి పార్టీ నాయకులు చేసే ఊసరవెల్లి రాజకీయాలపై మాట్లాడటం లేదని విమర్శించారు. ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిని మించి ఒకరు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తూ, కాంగ్రెస్ తీరును ప్రజల్లోకి తీసుకువెళతామని అన్నారు.

నేడు మహాప్రస్థానంలో కావూరి అంత్యక్రియలు

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతితో తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రముఖ రాజకీయ శకం ముగిసింది. బుధవారం ఉదయం ఆయన హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన అంత్యక్రియల వివరాలను ఆయన మనవడు, విశాఖపట్నం టీడీపీ ఎంపీ శ్రీ భరత్ మీడియాకు వెల్లడించారు. కావూరి పార్థివ దేహాన్ని నేటి సాయంత్రం 5 గంటలకు బంజారాహిల్స్‌లోని ఆయన స్వగృహానికి తరలించనున్నారు. అభిమానులు, రాజకీయ ప్రముఖుల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని రేపు ఉదయం వరకు అక్కడే ఉంచనున్నారు. రేపు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు భరత్ తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా

# జిల్లా కేంద్రాలకూ 'రింగ్'లు!

**ప్రధాన జిల్లాల చుట్టూ రింగ్ రోడ్డుకు ప్రణాళికలు.. హైదరాబాద్ నుంచి త్వరగా చేరేలా ప్లాన్స్**

**బోధన, పెద్దాసుపత్రుల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలి**

**ప్రభుత్వ శాఖలు ఈవీ వాహనాలే కొనుగోలు చేయాలి**

**ఆర్అండ్‌బీ, రవాణా శాఖ సమీక్షలో సీఎం రేవంత్**



హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం తెలిపారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్–విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ శాఖలకు ఈవీ వాహనాలే**

కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రభుత్వంలోని ఏ శాఖైనా తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ఆర్‌టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని... ఇందుకు షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్ కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ఫ్లాప్, జగన్ టఫ్, పవన్ నాన్ సీరియస్

**రాజకీయ నేతలపై కవిత 'వన్ వర్డ్' కామెంట్స్ వైరల్**

**తెలంగాణకు కాబోయే సీఎం తానేనన్న కవిత**



హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో యాంకర్ అడిగిన ప్రశ్నలకు ఆమె ఒకే పదంలో స్పందిస్తూ పలువురు ప్రముఖులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఇంటర్వ్యూలో భాగంగా తెలంగాణ నేతల గురించి కవిత తనదైన శైలిలో స్పందించారు. తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌ను "గొప్ప ఉద్యమ నాయకుడు" అని అభివర్ణించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాత్రం "ఫ్లాప్ సీఎం" అంటూ ఘాటుగా విమర్శించారు. బీజేపీ నేత ఈటెల రాజేందర్‌ను "గట్టి ఫైటర్" అని పేర్కొన్న కవిత, మరో నేత ధర్మపురి అరవింద్‌ను "అబద్ధానికి ప్రతిరూపం" అని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ గురించి మాట్లాడుతూ.. "అన్నను గెలవనివ్వరు, ఏమీ చేయనివ్వరు" అంటూ తన అభిప్రాయం చెప్పారు. ఇదే క్రమంలో ఏపీ రాజకీయ నేతలపైనా కవిత తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడుతూ, "ఈ వయసులో అద్భుతమైన పట్టుదలతో మళ్లీ సీఎం అయ్యేవరకూ కొట్లాడారు, గ్రేట్" అని ప్రశంసించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను "గట్టి లీడర్" అని, ఆయన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డిని "గుడ్ లీడర్" అని పేర్కొన్నారు. వైఎస్ షర్మిల ఏపీకి సీఎం కావాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇక, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను "నాన్ సీరియస్ పర్సన్" అని, నారా లోకేశ్ ఇంకా నేర్చుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. అన్నింటికన్నా ముఖ్యంగా తన గురించి తాను స్పందిస్తూ "ఫ్యూచర్ సీఎం ఆఫ్ తెలంగాణ" అని కవిత ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ, ఏపీకి చెందిన అధికార, ప్రతిపక్ష నేతలపై ఆమె చేసిన ఈ సూటి వ్యాఖ్యలతో కూడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# గ్యాస్ బుకింగ్ మోసాలపై జాగ్రత్త

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): గ్యాస్ బుకింగ్ పేరుతో మోసాలు చేసేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఈ కొత్త తరహా మోసాల పట్ల అప్రమత్తం చేశారు. వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, గ్యాస్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలకు తెరతీశారని తెలిపారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ, అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని, వాట్సాప్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింకులను పంపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా, ఆన్‌లైన్‌లో ముందుగా డబ్బులు చెల్లిస్తే గ్యారెంటీగా, అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని నమ్మబలికే సందేశాలు వస్తే అవి కచ్చితంగా సైబర్ మోసాలేనని గ్రహించాలని ప్రజలకు సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని సూచించారు. సిలిండర్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లను లేదా అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని అన్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు చూసి గుర్తుతెలియని వ్యక్తులకు మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని సూచించారు. నకిలీ వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేయడం ద్వారా మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని సజ్జనార్ పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ మోసాలకు గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 కి కాల్ చేయాలని లేదా http://cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కవిత దీక్ష విరమణ

హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిరవధిక దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి వెలుగుమట్ల బాధితులకు హామీ వచ్చిన నేపథ్యంలో ఆమె తన దీక్షను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విరమించారు. కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ కూడా దీక్షను విరమించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కవిత ఖమ్మంలో సోమవారం రాత్రి నిరవధిక దీక్షను చేపట్టారు. పోలీసులు ఆమెను అడ్డుకుని హైదరాబాద్‌కు తరలించగా, నగరంలో ఆమె దీక్షను కొనసాగించారు. వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పంపిణీ చేశారు. వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నామని అన్నారు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచి తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని కూడా ధైర్యం చెప్పారు. వెలుగుమట్ల అంశంపై ప్రభుత్వం స్పందించడంతో కవిత దీక్ష విరమించారు. దీక్ష విరమణ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తమ పోరాటం ఆగలేదని, కేవలం విరామం మాత్రమే అన్నారు. వెలుగుమట్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. మన ఆందోళనలు, వెలుగుమట్ల ఆడపడుచుల నిరసనలతో ప్రభుత్వం దిగి వచ్చిందని అన్నారు.

## స్పీకర్ చర్య ప్రజాతీర్పుకు అవమానం

**బీఆర్ఎస్ సీనియర్ నేత నవీన్ పోగుల**



జూబ్లీహిల్స్-హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తి ని అపహాస్యం చేసినట్టే అని నవీన్ పోగుల అన్నారు. ప్రజలు ఒక పార్టీ గుర్తుపై ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు తర్వాత అధికారంలో ఉన్న పార్టీలో చేరడం ప్రజల తీర్పును తుంగలో తొక్కినట్టేనని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచి, ప్రజల తీర్పును పూర్తిగా అవమానించినట్టేనని అన్నారు. కడియం శ్రీహరి కూతురు కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేసిన విషయం అందరికీ తెలిసిందే అని గుర్తుచేశారు. కడియం శ్రీహరి స్వయంగా కాంగ్రెస్ కండువా వేసుకుని తన కూతురు తరపున ఎన్నికల ప్రచారం చేయడమే కాకుండా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ బీఫామ్‌పై పోటీ చేసిన అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఇలాంటి స్పష్టమైన పరిస్థితుల్లో కూడా వారికి స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థలను అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఉపయోగిస్తున్నారనే వాదనకు బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు.

## జగన్ చిట్టా కేంద్రం చేతిలో: అప్పలనాయుడు

విజయవాడ, మార్చి 11 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా నాశనం చేసిందంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఘాటుగా స్పందించారు. జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందని, ఇప్పుడు ఆయన ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. "జగన్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చివరకు మున్సిపల్ కార్యాలయాలను కూడా తాకట్టు పెట్టారు. దేశంలో ఎక్కడా లేని వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు" అని కలిశెట్టి ఆరోపించారు. జగన్ చిట్టా మొత్తం కేంద్రం వద్ద ఉందని, ఆయన ఢిల్లీకి లేఖలు రాసినా ప్రయోజనం ఉండదని అన్నారు. ఐదేళ్ల పాలనలో నకిలీ మద్యం విక్రయాల ద్వారా జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని కలిశెట్టి విమర్శించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ ఇప్పుడు సంస్కరణల గురించి మాట్లాడుతున్నారని, ఆయన ప్రెస్ మీట్లు పెట్టుకోవచ్చు కానీ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. డిప్యూటీ సీఎం చెప్పినట్టు పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా భవిష్యత్తు తరాల సంపద కోసం చంద్రబాబు పాలన అవసరమని, అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కలిశెట్టి పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఇస్తోందని.. తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిపై అనవసర ఆరోపణలు చేయడం జగన్ మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## నందిగం సురేశ్‌పై చీటింగ్ కేసు

విజయవాడ, మార్చి 11 (ఈవార్తలు): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ మరోసారి చట్టపరమైన చిక్కుల్లో చిక్కుకున్నారు. చర్చి ట్రస్ట్ పునరుద్ధరణ పేరుతో భారీ మొత్తంలో డబ్బు తీసుకుని మోసం చేశారనే ఆరోపణలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేసు వివరాల్లోకి వెళితే, కాకినాడకు చెందిన సీబీఎన్సీ చర్చి ట్రస్ట్ సభ్యులు, దాని రెన్యువల్ కోసం 2021లో అప్పటి ఎంపీ నందిగం సురేశ్‌ను ఆశ్రయించారు. ఈ పని పూర్తి చేయడానికి సురేశ్ రూ. 25 లక్షలు డిమాండ్ చేశారని, ఆ మేరకు ఉద్దండరాయునిపాలెంలోని ఆయన నివాసంలో నగదు అందజేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఏళ్లు గడుస్తున్నా పని పూర్తి కాకపోవడంతో పాటు, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే ఆయన తమను బెదిరింపులకు గురిచేశారని ట్రస్ట్ సభ్యుడు ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన సూర్యారావుపేట పోలీసులు, మాజీ ఎంపీపై సెక్షన్ 318(4) (చీటింగ్), 351(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే అమరావతి భూముల వ్యవహారం, గతంలో జరిగిన దాడుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొని, జైలు నుంచి విడుదలైన నందిగం సురేశ్‌కు, ఈ తాజా చీటింగ్ కేసు రూపంలో కొత్త తలనొప్పి మొదలైంది.



## ఇరాన్ యుద్ధం 'కొబ్బరి'కి శాపం

**పోర్టుల్లోనే నిలిచిన ఎగుమతులు.. పడిపోయిన ధరలు**

**ఏపీ, తమిళనాడు నుంచి గల్ఫ్‌కు ఎగుమతి**

కాకినాడ, మార్చి 11 (ఈవార్తలు): అల్లకల్లోలంగా మారిన గల్ఫ్ దేశాల పరిస్థితులు దక్షిణాది కొబ్బరి రైతుల నడ్డి విరుస్తున్నాయి. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. తమిళనాడు, ఏపీల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతాయి. అయితే, ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో కోట్లాది రూపాయల విలువైన కొబ్బరి నిల్వలు ఓడరేవుల్లోనే మూలుగుతున్నాయి. దీని ప్రభావం నేరుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మార్కెట్లపై పడటంతో ధరలు భారీగా పతనమయ్యాయి. సాధారణంగా రంజాన్ మాసంలో కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాల్లో కొబ్బరికాయలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఈ ఏడాది కూడా ఎగుమతిదారులు భారీ ఆర్డర్ల కోసం సరకును సిద్ధం చేశారు. అయితే, యుద్ధం కారణంగా ముంబై, చెన్నై, తూత్తుకూడి పోర్టుల నుంచి వెళ్లాల్సిన కంటెయినర్లు అక్కడే ఆగిపోయాయి. ఈ అనిశ్చితి ఎప్పుడు తొలగుతుందో తెలియక వ్యాపారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో మహాశివరాత్రి సమయంలో కోనసీమ మార్కెట్‌లో కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ, ప్రస్తుత సంక్షోభం ధరలను ఒక్కసారిగా తగ్గించేసింది. గత నెలలో వెయ్యి పచ్చి కాయలు రూ.18,000 నుంచి రూ.20,000 వరకు పలికాయి. ప్రస్తుతం ఎగుమతులు నిలిచిపోవడంతో అదే వెయ్యి కాయల ధర రూ.13,000 – 14,000కు పడిపోయింది. శ్రీరామనవమి సీజన్‌లో మంచి లాభాలు వస్తాయని ఆశించిన వ్యాపారులకు గల్ఫ్ సంక్షోభం గట్టి దెబ్బే కొట్టింది. విదేశాలకు వెళ్లాల్సిన నాణ్యమైన సరకు పోర్టుల్లో నిలిచిపోవడంతో ఆ నిల్వలను స్థానిక మార్కెట్లలో తక్కువ ధరకే విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని మార్కెట్ విశ్లేషకుడు అప్పన కాళీప్రసాద్ వెల్లడించారు. యుద్ధం సద్దుమణిగి ఎగుమతులు పునఃప్రారంభమైతే తప్ప కొబ్బరి మార్కెట్ మళ్లీ కోలుకునే సూచనలు కనిపించడం లేదు.




## కొండ ప్రవీణ్ కుమార్‌కు కీలక పదవి

మంచిర్యాల, మార్చి 11 (ఈవార్తలు): ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కొండ ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల లో అంబేద్కర్ భవన్‌లో జరిగిన హ్యూమన్ రైట్స్ సమావేశంలో హ్యూమన్ రైట్స్‌పై చర్చ నిర్వహించారు. అనంతరం కొంతమందికి పదోన్నతులు కల్పించారు. అందులో భాగంగా హ్యూమన్ రైట్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీగా పవన్ కళ్యాణ్, కోఆర్డినేటర్ గా శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, మంచిర్యాల జిల్లా ఉమెన్స్ వింగ్ సెక్రటరీగా మమతను నియమించారు.



## హెచ్‌సీయూ నిధుల దుర్వినియోగం!?

**ఏబీవీపీ విద్యార్థి నేతల ఆందోళనబాట**

గచ్చిబౌలి-హైదరాబాద్, మార్చి 11 (ఈవార్తలు): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కేంద్రం ఇచ్చిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ నిధులను దుర్వినియోగం చేశారని ఏబీవీపీ విద్యార్థి నేతలు ఆందోళన బాట పట్టారు. స్టూడెంట్స్ వెల్ఫేర్‌కి మొత్తం 710.5 కోట్లు కేటాయించినప్పటికీ, యూనివర్సిటీ అధికారులు విద్యార్థి సంక్షేమానికి 3.57 కోట్లు మాత్రమే కేటాయించడంపై భగ్గుమన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ కింద వచ్చిన రూ.1000 కోట్ల నిధుల ఖర్చులో అవకతవకలు జరిగాయలని ఆరోపించారు. ఈ అంశంపై వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# జర్నలిస్టులకూ హెల్త్ స్కీం!

**ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే పథకం.. సీఎంతో చర్చించి నిర్ణయం**

**టీడబ్ల్యూజేఎఫ్ నాయకులతో రాజనర్సింహ**



హైదరాబాద్, మార్చి11 (ఈవార్తలు): ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకూ వర్తింపజేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న హెల్త్ స్కీం ను జర్నలిస్టులు, వారి కుటుంబాలకు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జే ఎఫ్) బృందం బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ, జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో చర్చించి హెల్త్ పాలసీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసినవారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, గుడిగ రఘు, కార్యదర్శులు చంద్ర శేఖర్, జగదీశ్వర్ ఉన్నారు.

# త్వరలో జర్నలిస్టులకూ తీపికబురు

**ఇండ్ల స్థలాల కలను నెరవేరుస్తాం**

**మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల**



ఖమ్మం, మార్చి 11 (ఈవార్తలు): త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై తీపి కబురు ఇస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమల నాగేశ్వరరావు అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు మంత్రులు స్పందించారు. ఖమ్మం కలెక్టరేట్ లో బుధవారం వెలుగుమట్ల భూ నిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ అనంతరం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు 'నెక్స్ట్ మీకే ...ముఖ్యమంత్రి ఇప్పటికే చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు త్వరలో తీపి కబురు అందిస్తాం. కల నెరవేర్చుతాం..' అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉందని, న్యాయపరమైన చిక్కులు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓ పాలసీ తీసుకు వస్తామని, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తామని ప్రజా ప్రభుత్వం హామీ ఇచ్చిందని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు గుర్తు చేశారు. అనేకమంది జర్నలిస్టులు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు కావడంతో వారి ఆర్థిక స్థితిగతులు ఏమాత్రం ఆశాజనకంగా లేవన్నారు. ఒక్కొక్కరూ పది, పదిహేను ఏళ్లుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నా ఇప్పటి వరకూ గజం జాగాకు కూడా నోచుకోలేదని, చాలా దుర్భరంగా జీవితాలను వెళ్లదీస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు సైతం స్థలాలు ఇవ్వాలని, అలాగే అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద గృహనిర్మాణ లబ్ధి చేకూర్చాలని వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, నాయకులు కూరాకుల గోపీ, ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, మధుశ్రీ, రాంపుడి నాగేశ్వరరావు, జానీపాష, యాకేష్, తురగ రాజేంద్రమూర్తి, గరిదేపల్లి వెంకటేశ్వర్లు, గణేష్, అర్షద్, శరత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



### వివేకా హత్య కేసు..

## ట్రయల్ కోర్టుకు సుప్రీం కీలక ఆదేశాలు..

**సునీత పిటిషన్ కొట్టివేత**

**వివేకా హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సుప్రీంకోర్టుకు తెలిపిన సీబీఐ**

**4 వారాల్లోగా విచారణను ముగించాలని ట్రయల్ కోర్టుకు సుప్రీం ఆదేశం**

**నిందితుల బెయిల్ రద్దు చేయాలన్న సునీత, సీబీఐ పిటిషన్లు డిస్మిస్**

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తు ప్రక్రియ ముగిసిందని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. ధర్మాసనం ఈ కేసుపై స్పందిస్తూ, విచారణను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టుకు స్పష్టమైన గడువు విధించింది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా సీబీఐ తరఫు న్యాయవాది కీలక ప్రకటన చేశారు. ఈ కేసులో ఇప్పటికే మూడవ సప్లిమెంటరీ (అదనపు) ఛార్జిషీట్‌ను దాఖలు చేశామని, దీంతో తమ వైపు నుంచి దర్యాప్తు ప్రక్రియ పూర్తయిందని న్యాయస్థానానికి వివరించారు. దర్యాప్తు ముగిసిన నేపథ్యంలో, నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ గతంలో సీబీఐ, వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అవసరం లేదని భావించిన ధర్మాసనం, వాటిని డిస్మిస్ చేసింది. అయితే, తాము లేవనెత్తిన కొన్ని కీలక అంశాలపై సీబీఐ సరైన దర్యాప్తు చేయలేదని సునీత తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ధర్మాసనం... కేసులోని అంశాలు లేదా ఆధారాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సూచించింది. సెక్షన్ 207 కింద ట్రయల్ కోర్టులో దాఖలైన అన్ని పిటిషన్లను పరిశీలించి, విచారణను పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ కేసులో జాప్యాన్ని నివారించేందుకు సుప్రీంకోర్టు ఒక కీలక కాలపరిమితిని విధించింది. ట్రయల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లోగా విచారణ ముగించి, తగిన తీర్పు వెలువరించాలని ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ ఒక నెల గడువుతో, వివేకా హత్య కేసులో రాబోయే 30 రోజులు అత్యంత కీలకం కానున్నాయి.

# క్లాసికల్ సింగర్ మాళవిక ఆనంద్ కు సత్కారం




హైదరాబాద్,మార్చి 11 (ఈవార్తలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బర్కత్ పుర ప్రాంతానికి చెందిన ప్రముఖ క్లాసికల్ సింగర్ కుమారి మాళవిక ఆనంద్ ను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి సతిమణి, ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ జి.సరోజ వివేక్ అభినందించి సత్కరించారు. ఆధ్యాత్మిక పాటలతో సంగీత ప్రియులను కట్టిపడేస్తూ దేశ, విదేశాల్లో 700లకు పైగా సాంస్కృతిక ప్రదర్శనల్లో మాళవిక ఆనంద్ పాల్గొన్నారు. 9ఏళ్ల వయసులోనే తెలుగు, హిందీ, కన్నడ, తమిళ్ 17 కీర్తనలతో 'శ్రీహరి సంకీర్తనలు' పేరిట అల్బమ్ రూపొందించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న ఘనత మాళవిక ఆనంద్. 2008 సంవత్సరంలో సీడీని రూపొందించిన నాటి నుంచి నేటి వరకు అనేక భాషల్లో పాటలు పాడి పలు ప్రపంచ రికార్డుల్లో తన పేరును నమోదు చేసుకున్నారు. తన ప్రతిభతో 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ' లో మాళవిక పేరు తెచ్చుకుంది. తన గానామృతంతో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుని అందరిచేత ప్రశంసలు అందుకుంటోంది. కార్యక్రమంలో కెఎం భారతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ఉప ప్రధానా?

**జగన్ రియాక్షన్ వైరల్!**

**దేశం ఏం భరిస్తుంది? అంటూ ఎద్దేవా**



తాడేపల్లి, మార్చి 11 (ఈవార్తలు): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి ఉప ప్రధాని అవుతారంటూ జరుగుతున్న ప్రచారంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్ర ప్రజలే చంద్రబాబును భరించలేకపోతున్నారని, ఇక దేశ ప్రజలు ఎలా భరిస్తారని ఆయన ఎద్దేవా చేశారు. ఇవాళ ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి.. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారని, ఉప ప్రధాని అవుతారని ప్రచారం జరుగుతోంది కదా అని జగన్‌ను ప్రశ్నించారు. దీనికి జగన్ బదులిస్తూ, "చంద్రబాబు ఉప ప్రధానా? ఎవరు చెప్పినారు సామీ.. గొప్ప సంగతే ఇది. చంద్రబాబును ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలే బరాయించలేకున్నారు.. ఉప ప్రధానిగా దేశ ప్రజలు ఏం బరాయిస్తారు" అంటూ సెటైర్లు వేశారు. ఇటీవల సోషల్ మీడియాలో చంద్రబాబు జాతీయ రాజకీయ ప్రవేశంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవిని వదులుకుని రాజ్యసభకు వెళ్లవచ్చనే వార్తల నేపథ్యంలో చంద్రబాబు కూడా అదే తరహాలో ఏపీ సీఎం పదవిని వదిలి కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆయన ఉప ప్రధాని అవుతారనే ప్రచారం కూడా జోరందుకుంది. ఈ ప్రచారంపై జగన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**బాబు పాలనలో అప్పుల ఊబిలోకి: జగన్**

ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ గణాంకాల నుంచి అవినీతి వరకు పలు అంశాలపై గణంకాలతో సహా విమర్శలు గుప్పించారు. పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు, వాస్తవానికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయని జగన్ ఆరోపించారు. కాగ్ నివేదికను ఉదహరిస్తూ.. ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని విమర్శించారు. "మేము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే చంద్రబాబు రెండేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారు" అని జగన్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో కోవిడ్ కష్టాల్లో కూడా ఎన్బీసీ (నెట్ బారోయింగ్ సీలింగ్ ) పరిమితిని దాటలేదని, కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే నెట్ బారోయింగ్ సీలింగ్ దాటి విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 3.31 లక్షల కోట్ల అప్పులు దాటేసిందని, జీఎస్‌డీపీ లో అప్పుల శాతం 5.089కి పెరిగిందని గణాంకాలు వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పడిపోవడానికి 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానమే కారణమని జగన్ విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి భూములు కట్టబెట్టడం వరకు అన్నింటా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. విశాఖలో రూ. 5 వేల కోట్ల విలువైన భూములను చంద్రబాబు తన బంధువులకు కట్టబెట్టారని, రియల్ ఎస్టేట్ సంస్థలకు తక్కువ ధరకు భూములు ఇస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని, ఏడాదిలో కేవలం 8 రోజులు మాత్రమే కనీస నిల్వలు ఉన్నాయని ఎద్దేవా చేశారు.




# బస్తర్‌లో 108 మంది నక్సలైట్ల లొంగుబాటు

**భారీగా నిధులు స్వాధీనం**

రాయ్‌పూర్: ఛత్తీస్ గఢ్ లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఇంటెన్సివ్ ఆపరేషన్ సందర్భంగా 108 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు.దీంతో బస్తర్ లో మావోయిస్టు ఉద్యమం అంపశయ్యపై వుంది. మరోవైపు 108 మంది మావోయిస్టులు లొంగిపోవడమే కాకుండా, అతిపెద్ద ఆయుధ డంప్ ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దాంతో పాటు కిలో బంగారం, 3.61 కోట్ల నగదును స్వాధీనం చ్ఛకున్నారు. ఇప్పటి వరకు నక్సలైట్ల నుంచి ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ లో భాగంగా భద్రతా దళాలు అడవుల్లో నిరంతరం నక్సలైట్లే టార్గెట్ గా పనిచేశాయి. దీని కారణంగా నక్సలైట్లలో ఓ భయం, అసంతృప్తి, చికాకు కూడా పెరిగింది. దీంతో వారంతా లొంగిపోవడానికి సిద్ధమయ్యారు. దీంతో బస్తర్ లో వున్న నక్సలైట్లపై ఈ ప్రభావం పడి, లొంగిపోతున్నారు. అలాగే ఈ చర్య నక్సలైట్ల ఆర్థిక బలాన్ని, మానసిక స్థైర్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం, బస్తర్ పరిధిలోని వివిధ జిల్లాల్లో మొత్తం 108 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ మావోయిస్టులకు మొత్తం రూ.3.95 కోట్లు రివార్డులు ప్రకటించారు. లొంగిపోయిన వారిలో సంస్థలోని వివిధ స్థాయిలకు చెందిన కార్యకర్తలు ఉన్నారు. చాలామంది చాలా కాలంగా మావోయిస్టు సంస్థలో క్రియాశీల సభ్యులుగా ఉన్నారు. బీజాపూర్‌లో 37 మంది, నారాయణ్‌పూర్‌లో 4 మంది, బస్తర్‌లో 16 మంది, కాంకేర్‌లో 3 మంది, సుక్మాలో 18 మంది, దంతేవాడలో 30 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

## గుంతలో పడి బతికేసింది!

**బ్రెయిన్ డెడ్ మహిళకు చలనం**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో వైద్యులు బ్రెయిన్ డెడ్ అని ప్రకటించిన మహిళను కుటుంబ సభ్యులు అంబులెన్సులో ఇంటికి తీసుకువెళుతుండగా భారీ కుదుపుతో అపస్మారకస్థితి నుంచి బయటపడి ఊపిరితీసుకోవడం ప్రారంభించింది. కుటుంబ సభ్యులు ఆ మహిళ ప్రాణాలపై ఆశలు కోల్పోయారు. కానీ ఆమె బతికింది. అంత్యక్రియలకు సిద్ధమైన ఆ కుటుంబం ఈ అనూహ్య పరిమాణంతో, ఆమెను తిరిగి ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. ఈ ఘటన ఫిలిభిత్ జిల్లాకు చెందిన వినితా శుక్లా స్థానిక జిల్లా కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఫిబ్రవరి 22న ఇంటి పనులు చేస్తుండగానే ఒక్కసారిగా కిందపడిపోయారు. దీనితో కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బరేలీలోని మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమెను మూడు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. ఆమె అపస్మారక స్థితిలో ఉందని, బతికే అవకాశాలు తక్కువ అని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఇంటికి తీసుకువెళ్లిపోవాలని కుటుంబ సభ్యులకు వైద్యులు చెప్పారు. దీనితో ఫిబ్రవరి 24న అంబులెన్సులో ఇంటికి తీసుకువెళుతుండగా బరేలీ-హరిద్వార్ జాతీయ రహదారిపై గుంత వద్ద వాహనం భారీ కుదుపుకు గురైంది. వెంటనే స్పృహలోకి వచ్చిన ఆమె శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. అంత్యక్రియల క్రియలకు ఏర్పాట్లు చేసిన కుటుంబ సభ్యులు ఆమెను తిరిగి చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆ తర్వాత 12 రోజుల పాటు ఐసీయూలో ఉన్న ఆమె పూర్తిగా కోలుకున్నారు.

## యుద్ధం ఆగేది నా చేతుల్లోనే!:ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ఆగుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. ఇరాన్ వద్ద ఇంకా ఏమీ మిగలలేదని అన్నారు. ఇరాన్‌తో త్వరలో యుద్ధం ముగుస్తుందని వ్యాఖ్యానించారు. యాక్సియోస్‌తో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, నేను ఎప్పుడు యుద్ధం ముగియాలనుకుంటే అప్పుడే ముగుస్తుందని అన్నారు. తమ ఆపరేషన్‌లో ఇరాన్ లక్ష్యాలను అన్నింటిని ఛేదించామని అన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ అంతకుముందు రోజు చేసిన వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయి.

# లోక్‌సభ స్పీకర్‌కు ఊరట

**వీగిపోయిన అవిశ్వాస తీర్మానం.. మూజువాణి ఓటుతో వీగిన ప్రతిపక్షాల తీర్మానం**

**చర్చలో రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు**





న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సుమారు 13 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం, తీవ్ర గందరగోళం మధ్య తాత్కాలిక స్పీకర్ జగదాంబికా పాల్ నిర్వహించిన మూజువాణి ఓటుతో ఈ తీర్మానాన్ని తిరస్కరించారు. అవిశ్వాసంపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర నినాదాలతో సభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 118 మంది విపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. నిన్న చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఇది వ్యక్తిగతంగా బిర్లాను లక్ష్యం చేసుకోవడానికి కాదని, పార్లమెంట్ గౌరవాన్ని కాపాడటానికే అని పేర్కొన్నారు. దీనికి బదులిచ్చిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ పనితీరును గట్టిగా సమర్థించారు. అయితే, చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాల ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టారు. స్పీకర్ స్థానం అత్యంత పవిత్రమైందని, ఆయన నిర్ణయాలను సుప్రీంకోర్టులో సైతం ప్రశ్నించలేమని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో, నేటి కాంగ్రెస్ మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే స్పీకర్లపై అవిశ్వాసం పెట్టాయని గుర్తుచేశారు. ఆ సమయంలో స్పీకర్లు చైర్‌లోనే కూర్చోగా, ఈసారి ఓం బిర్లా మాత్రం తీర్మానంపై నిర్ణయం వెలువడే వరకు చైర్‌లో కూర్చోకుండా కొత్త పార్లమెంటరీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అమిత్ షా లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారని, బడ్జెట్, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక చర్చల్లో పాల్గొనడానికి ఎందుకు ఇష్టపడరని ప్రశ్నించారు. "సమావేశాలు వచ్చినప్పుడల్లా ఆయన విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకుంటారు. మరి విదేశాల నుంచి ఇక్కడ మాట్లాడతారా?" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మొత్తం మీద స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న ప్రతిపక్షాల వ్యూహం ఫలించలేదు. పైగా ప్రభుత్వ ఎదురుదాడితో ప్రతిపక్షాలే ఆత్మరక్షణలో పడినట్లు కనిపించింది. ఈ పరిణామం విపక్షాలకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

# యుద్ధంపై కాంగ్రెస్ రాజకీయం

**ప్రవాసులపై బాధ్యతారాహిత్య ప్రకటనలు**

**ప్రధాని మోదీ మండిపాటు**



ఎర్నాకులం: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ మన దేశంలో రాజకీయానికి ఉపయోగించుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన ఎర్నాకులంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పశ్చిమాసియా దేశాల్లోని ప్రవాస భారతీయుల పరిస్థితి మరింత దిగజారేలా రెచ్చగొట్టే, బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోందని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మనం ఆందోళన చెందడం సహజమేనని, అక్కడ లక్షలాది మంది భారతీయులు పని చేస్తున్నారని గుర్తు చేశారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మన పౌరులు విదేశాల్లో చిక్కుకున్నప్పుడల్లా వారి క్షేమం కోసం వనరులన్నీ ఉపయోగిస్తుంటామని అన్నారు. మన పౌరులను ఎప్పుడూ ఒంటరిగా వదిలేసేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లోని మన వారికి అవసరమైన సహాయం అందేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వెల్లడించారు. అక్కడి మన దేశ రాయబార కార్యాలయాలు మన పౌరులకు 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. మన మిత్ర దేశాలు భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. ఈ ప్రచారం కోసం వారు అవసరమైతే రీల్స్ కూడా చేస్తారేమోనని ఎద్దేవా చేశారు. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు, మేకిన్ ఇండియాను బలోపేతం చేయడానికి పెట్రోలియం రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకమని అన్నారు. ఈ యుద్ధం స్వావలంబన అవశ్యకతను మరోసారి నొక్కి చెప్పిందని అన్నారు.

# భార్యను చంపిన భారతీయుడిపై 9.18 కోట్ల రివార్డు

**11 ఏళ్లుగా పరారీలో.. ఆచూకీ కోసం ఎఫ్‌బీఐ నిర్ణయం**

మేరీల్యాండ్: అమెరికాలో 11 ఏళ్ల క్రితం భార్యను దారుణంగా హత్య చేసి పరారీలో ఉన్న భద్రేశ్‌కుమార్ చేతన్‌భాయ్ పటేల్ అనే భారతీయుడిపై అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) రివార్డును భారీగా పెంచింది. అతని ఆచూకీ తెలిపిన వారికి ఇచ్చే రివార్డును 2,50,000 డాలర్ల నుంచి ఏకంగా 1 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 9.18 కోట్లు) పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎఫ్‌బీఐ 'టాప్ 10 మోస్ట్ వాంటెడ్' జాబితాలో భద్రేశ్‌కుమార్ ఉన్నాడు. వివరాల్లోకి వెళితే... 2015 ఏప్రిల్ 12న మేరీల్యాండ్‌లోని హనోవర్‌లో ఉన్న ఓ డంకిన్ డోనట్ షాపులో భద్రేశ్‌కుమార్, అతని భార్య పాలక్ పటేల్ (21) నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే భార్యను దారుణంగా హత్య చేసినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. షాపులోని సీసీటీవీ ఫుటేజీలో ఇద్దరూ కిచెన్ వైపు వెళ్లడం రికార్డయింది. ఆ తర్వాత కొంతసేపటికి కస్టమర్లు వచ్చి పిలిచినా ఎవరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చూడగా, కిచెన్‌లో పాలక్ మృతదేహం లభ్యమైంది. దర్యాప్తు ప్రకారం భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని పాలక్ కోరుకోవడం, దీనికి భద్రేశ్‌కుమార్ అంగీకరించకపోవడంతో ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఘటన జరిగిన రోజు పాలక్ తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు ఈ వాగ్వాదం పెరిగి హత్యకు దారితీసిందని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. హత్య తర్వాత, దగ్గరలోని తమ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి కొన్ని వస్తువులు, నగదు తీసుకుని ట్యాక్సీలో న్యూజెర్సీలోని నెవార్క్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ఓ హోటల్‌కు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం అక్కడి నుంచి నెవార్క్ పెన్ స్టేషన్‌కు వెళ్లి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభ్యం కాలేదు. గత 11 ఏళ్లలో 300కు పైగా ఆధారాలు లభించినప్పటికీ, భద్రేశ్‌కుమార్‌ను పట్టుకోలేకపోయామని అధికారులు చెబుతున్నారు. "ఈ 1 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటనతో మా అన్వేషణకు మరింత ప్రచారం లభించి, పాలక్‌కు న్యాయం చేయడానికి అవసరమైన సమాచారం వస్తుందని ఆశిస్తున్నాం" అని ఎఫ్‌బీఐ బాల్టిమోర్ ఫీల్డ్ ఆఫీస్ స్పెషల్ ఏజెంట్ జిమ్మీ పాల్ తెలిపారు. టీచర్ కావాలని కలలు కన్న పాలక్‌ను ఆమె కుటుంబం ఎంతగానో మిస్ అవుతోందని, నిందితుడిని పట్టుకోవడానికి ప్రజల సహాయం కీలకమని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## జపాన్ చమురు రిజర్వులు రిలీజ్

టోక్యో: ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఎదుర్కొంటుంది. దీనితో ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జపాన్ కీలక నిర్ణయం తీసుకున్నది. తమ వద్ద ఉన్న చమురు నిల్వల్లో కొంత భాగాన్ని విడుదల చేస్తామని తెలిపింది. మార్చి 16వ తేదీ నాటికి మార్కెట్లోకి తీసుకువస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ ప్రధాని సనయే తకయిచి వెల్లడించారు. మార్చి 16 నుంచి చమురు నిల్వల్లో కొంత భాగాన్ని విడుదల చేయడం ప్రారంభిస్తామని తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల వేళ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు తమ వద్ద ఉన్న చమురు నిల్వలను విడుదల చేస్తామని అన్నారు. ప్రైవేటు రంగ సంస్థల చమురు నిల్వలను, ప్రభుత్వరంగ చమురు నిల్వలను విడుదల చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. అప్పుడు చమురు లభ్యత పెరిగి ధరల స్థిరీకరణకు దోహదపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో జీ7 దేశాల ఆర్థిక మంత్రులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై, ఇంధన సరఫరాల్లోని అంతరాయంపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చమురు నిల్వలను విడుదల చేసి మద్దతుగా నిలువాలని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ జీ7 దేశాలను కోరింది. కాగా, తమ వద్ద ఉన్న చమురు నిల్వలను విడుదల చేయాలని నిర్ణయించిన తొలి జీ7 దేశం జపాన్ కావడం గమనార్హం.

## టెలిగ్రామ్‌కు కేంద్రం షాక్

**పైరసీ కంటెంట్‌పై నోటీసులు.. 3,142 పైరసీ ఛానెళ్ల గుర్తింపు**



న్యూఢిల్లీ: పైరసీ కంటెంట్‌ను అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌కు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా నోటీసులు జారీ చేసింది. కాపీరైట్ ఉన్న సినిమాలు, వెబ్ సిరీస్‌లు తమ ప్లాట్‌ఫామ్‌పై విచ్చలవిడిగా షేర్ అవుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 కింద ఈ నోటీసులు ఇచ్చింది. జియో సినిమా, అమెజాన్ ప్రైమ్ వీడియో వంటి ప్రముఖ ఓటీటీ సంస్థలు తమ కంటెంట్‌ను అనుమతి లేకుండా టెలిగ్రామ్‌లో విస్తృతంగా పంచుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు సుమారు 3,142 టెలిగ్రామ్ ఛానెళ్లలో పైరసీ కంటెంట్ పంపిణీ జరుగుతున్నట్లు గుర్తించారు. టెలిగ్రామ్‌లో పెద్ద సైజు ఫైల్స్ పంపే సౌలభ్యం, వినియోగదారుల వివరాలు గోప్యంగా ఉండటం వంటి ఫీచర్లను కొందరు పైరసీ కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు తేలింది. ఇదిలా ఉంటే... అభ్యంతరకర, అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్రం ఇటీవల కఠినంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజుల క్రితమే మూడ్‌ఎక్స్‌వీఐపీ, కోయల్ ప్లేప్రో, డిజి మూవీప్లెక్స్ సహా ఐదు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించిన విషయం తెలిసిందే. గతంలో 2025 జులైలో కూడా ఇదే తరహా చర్యలు తీసుకున్నారు. అప్పట్లో అల్ట్, ఉల్లు, బిగ్‌షాట్స్ యాప్, దేశీఫ్లిక్స్ వంటి 25 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల వెబ్‌సైట్లు, యాప్‌లను బ్లాక్ చేయాలని ఆదేశించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) రూల్స్-2021 ప్రకారం.. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు అశ్లీల, అసభ్యకరమైన, ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకూడదు. ఆన్‌లైన్ పైరసీని అరికట్టడంతో పాటు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై అభ్యంతరకర కంటెంట్‌ను నియంత్రించే విస్తృత ప్రయత్నాల్లో భాగంగానే ప్రభుత్వం ఈ తాజా చర్యలు తీసుకుంటోంది.

## తల్లి కోసం వస్తే ఇరుక్కుపోయింది!

**యూఎస్ హెచ్-1బీ మహిళకు వీసా కష్టాలు**

**అపాయింట్‌మెంట్లు దొరక్క తీవ్ర ఇబ్బందులు**




న్యూఢిల్లీ: అమెరికాలో హెచ్-1బీ వీసాపై పనిచేస్తూ స్థిరపడిన ఓ భారతీయ మహిళ, తన జీవితంలో ఊహించని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూసుకునేందుకు హుటాహుటిన భారత్‌కు వచ్చిన ఆమె, తిరిగి అమెరికా వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. వీసా అపాయింట్‌మెంట్లు అందుబాటులో లేకపోవడంతో ఆమె ఉద్యోగం ప్రమాదంలో పడింది. ఏళ్ల తరబడి నిర్మించుకున్న జీవితం కళ్ల ముందే కూలిపోతుండటంతో ఆమె తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఆమె స్నేహితుడు ఒకరు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడిట్' ద్వారా పంచుకున్నారు. "నా స్నేహితురాలు తన తల్లి అనారోగ్యం కారణంగా అత్యవసరంగా అమెరికా నుంచి భారత్‌కు వచ్చింది. ఇప్పుడు ఇక్కడే చిక్కుకుపోయింది. ఆమె జీవితం, ఇల్లు, ఉద్యోగం, బాధ్యతలు అన్నీ అమెరికాలోనే ఉన్నాయి. ఇంటి లోన్, కారు లోన్ ఈఎంఐలు ఆగవు కదా" అంటూ ఆయన తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు. వీసా స్లాట్ దొరకకపోతే, అమెరికాలోని తన ఇల్లు, ఇతర ఆస్తులను అమ్ముకోవడానికి కూడా ఆమె సిద్ధపడుతున్నారని తెలిపారు. హెచ్-1బీ వీసాదారులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురవడం కొత్తేమీ కాదు. చాలాకాలం పాటు భారత్‌లో గడిపిన తర్వాత తిరిగి అమెరికా వెళ్లే క్రమంలో వీసా రద్దు కావడం లేదా ఉద్యోగం కోల్పోవడం అనే కారణంతో ఇబ్బందులు పడటం సాధారణమైంది. ఇటీవల కాలంలో అమెరికా ప్రభుత్వం వీసా నిబంధనలను కఠినతరం చేయడం, దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను సమీక్షించడం వంటి అదనపు తనిఖీలతో వీసా ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

## అమెరికా టెక్ స్థావరాలే లక్ష్యం: ఇరాన్

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దాడి కోసం ఈ సంస్థల సాంకేతికతను ఉపయోగిస్తున్నందున వీటిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్జీసీ అనుబంధ వార్తా సంస్థ తస్నిం న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ప్రముఖ సెర్చింజన్ సంస్థ గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్‌విడియా, ఒరాకిల్, పాలంటీర్ వంటి టెక్ సంస్థలు, గల్ఫ్ దేశాల్లో క్లౌడ్ ఆధారిత సేవలు అందిస్తున్న కొన్ని కార్యాలయాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు సంబంధించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది. ఇందుకోసం శత్రువులు తమకు స్వేచ్ఛ కల్పించారని అన్నారు. ఆయా ప్రదేశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రజలు ఉండవద్దని ఇరాన్ హెచ్చరించింది.

## లవ్లీ చిత్రం






Siva Karthikeyan with his beautiful family 🥰

## మా ఇంట్లో ఫైనాన్స్ మినిస్టర్ తనే

తనకు డబ్బు కావాల్సి వస్తే భార్య దగ్గర చేయి చాస్తానంటున్నాడు తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్. తన బ్యాంకులో ఎంత డబ్బుందన్న విషయం కూడా తనకు తెలియదని చెప్తున్నాడు. ఈయన నిర్మాతగా వ్యవహరించిన 'తాయ్ కిళవి' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రం రూ.50 కోట్ల మైలురాయిని దాటేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో శివకార్తికేయన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'పెళ్లయినప్పటి నుంచి నా ఆర్థిక వ్యవహారాలన్నీ భార్య ఆర్తియే చూసుకుంటోంది. నా అకౌంట్‌లో ఎంత డబ్బుందన్న విషయం కూడా నాకు తెలీదు. నేను ఎప్పుడు, ఏ ఖర్చు పెట్టాలన్నా తనను అడిగి తీసుకుంటాను. ఒక టికెట్ కొనాలన్నా కూడా తనను చేయి చాచి మనీ అడుగుతాను. అందుకు నేను ఏమీ బాధపడను, పైగా గర్వపడుతున్నాను. తన ముందుచూపు, దూరదృష్టి, పొదుపు చేసే వైఖరి వల్లే ఈరోజు నేను నిర్మాతగా సినిమాలు తీయగలుగుతున్నాను. తను అవన్నీ చూసుకోకపోయుంటే ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. రేపటికోసం జాగ్రత్తపడే ప్రతి మహిళకు మా సినిమా అంకితం. సంపాదన ఎంతున్నా సరే దానిలో ఎంతో కొంత వెనకేయాలనే ఆడవారు ఆలోచిస్తారు' అని చెప్పుకొచ్చాడు.

## ధురందర్-2 టికెట్ రేటు రూ. 3100

భారీ అంచనాలతో విడుదలకు సిద్ధమైన ధురంధర్–2 సినిమా టికెట్ ధరల విషయంలో కొత్త రికార్డు సృష్టించింది. దేశంలోనే అత్యధిక టికెట్ ధరగా రూ.3100ను ఢిల్లీలోని ఐనాక్స్ మెగాప్లెక్స్‌లోని ఒక ప్రత్యేక స్క్రీన్‌లో ఫిక్స్ చేశారు. కేవలం 42 సీట్లు మాత్రమే ఉన్న ఈ స్క్రీన్‌లో ప్రీమియర్స్ కోసం ఈ రేటు అమలు చేస్తున్నారు. బుక్ మై షో చార్జీలతో కలిపితే ధర రూ.3145కి చేరుతుంది. ప్రస్తుతం అదే స్క్రీన్‌లో ప్రదర్శితమవుతున్న ది కేరళ స్టోరీ–2 టికెట్ ధర కేవలం రూ.500 మాత్రమే. అయితే ధురంధర్–2 క్రేజ్ కారణంగా ప్రీమియర్ షోలకు టికెట్ ధరను అమాంతం పెంచేశారు.



ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇప్పటికే సగానికి పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. దేశవ్యాప్తంగా ఒక రోజు ముందే పెయిడ్ ప్రివ్యూలు ప్లాన్ చేశారు. బెంగళూరులో కొన్ని స్క్రీన్లలో టికెట్ ధరలు రూ.800 వరకు ఉన్నాయి. హైదరాబాద్‌లో కూడా ఎప్పటిలాగే రేట్లు పెంచారు. సాయంత్రం 5 గంటలకే అన్ని ప్రాంతాల్లో ప్రీమియర్స్ ప్రారంభం కానున్నాయి. అడ్వాన్స్ బుకింగ్స్ అద్భుతంగా సాగుతున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 3 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న మరో జంట

తెలుగు సినీ పరిశ్రమలో మరో పెళ్లి వార్త ఇప్పుడు వైరల్ అవుతోంది. రీసెంట్ గా విజయ్ దేవరకొండ రష్మిక మందన్న పెళ్లి ట్రెండింగ్ లో నిలిచిన విషయం తెలిసిందే. అలాగే బెల్లంకొండ వారి ఇంట్లో కూడా హడావుడి మొదలైంది. ఇక ఇప్పుడు ప్రముఖ సంగీత దర్శకుడి ఇంట కూడా పెళ్లి బాజాలు షురూ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడి కుమారుడు, ఒక యువ నటి త్వరలోనే వివాహ బంధంతో ఒకటి కాబోతున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. వీరిద్దరూ గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నారని, ఇప్పుడు ఇరు కుటుంబాల అంగీకారంతో పెళ్లికి సిద్ధమవుతున్నారని సమాచారం. అధికారికంగా ఎటువంటి ప్రకటన రాకముందే ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సదరు యువకుడు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు. కేవలం గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగా కూడా రాణిస్తూ తండ్రి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నాడు. మరోవైపు ఆ యువ నటి బాలనటిగా కెరీర్ ప్రారంభించి, ఇటీవల వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉంది.




## హన్సికకు విడాకులు



హీరోయిన్ హన్సిక మొత్వానీ నాలుగేళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలికింది. భర్త, వ్యాపారవేత్త సోహెల్ ఖతూరియా నుంచి విడాకులు తీసుకుంది. పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామంటూ హన్సిక బాంద్రా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. దీంతో న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేసింది. భర్త నుంచి ఎలాంటి భరణం అడగకుండానే హన్సిక విడాకులు కోరడం గమనార్హం. తమ మధ్య చిన్న విషయాలు కూడా తగాదాలుగా మారుతున్నాయని, ఒకే ఇంట్లో ఉండటం కూడా కష్టంగా ఉందని హన్సిక పిటిషన్‌లో పేర్కొంది. 2024 జూలై 2 నుంచే వీరు విడివిడిగా జీవిస్తున్నట్లు హన్సిక తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. కాగా హన్సిక 2022 డిసెంబర్ 4న సోహెల్‌ను పెళ్లాడింది. ఇది హన్సికకు మొదటి పెళ్లి కాగా అతడికి రెండోది కావడం గమనార్హం! హన్సిక – సోహెల్ వివాహ వేడుకకు రాజస్థాన్‌లోని జైపూర్ ప్యాలెస్ వేదికగా నిలిచింది. పెళ్లయి రెండేళ్లు కూడా కాకముందే దంపతుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. దీంతో చాలాకాలంగా వేర్వేరుగా జీవిస్తున్న వీరు ఇప్పుడు విడాకులతో దూరమయ్యారు.

## రష్మ వదిన.. అమ్మలా!





విజయ్ దేవరకొండను పెళ్లాడి దేవరకొండ ఇంట కోడలిగా అడుగుపెట్టింది రష్మిక మందన్న. దీంతో ఇప్పుడా ఆ కుటుంబంలో రష్మిక కీలకమైన వ్యక్తిగా మారిపోయింది. కేవలం విజయ్ భార్యగానే కాకుండా మరిది ఆనంద్ దేవర కొండకు ఒక వదినగా అంతకంటే మిన్నగా తల్లి ఆప్యాయతను పంచే వ్యక్తిగా ఆమె మారిపోయింది. రష్మికకు విజయ్ దేవరకొండ తో వివాహానికి ముందే ఆనంద్ తో మంచి స్నేహం ఉంది. విజయ్ ను పెళ్లి చేసుకోక ముందే ఆనంద్ ను ఉద్దేశించి రేయ్ నువ్వు నా ఫ్యామిలీ రా అంటూ రష్మిక పబ్లిక్ గా చేసిన వ్యాఖ్యలు అప్పట్లో ఎంత సంచలనమయ్యాయో తెలిసిందే. అన్నయ్య భార్యగా వచ్చిన రష్మిక ఆనంద్‌కు ఒక స్నేహితురాలిగా, మార్గదర్శిగా ఉంటూనే తల్లి లోటును తీర్చే వదినమ్మగా తన బాధ్యతను నెరవేరుస్తోంది.

## మౌళి.. క్రేజీ ప్రాజెక్ట్

యూట్యూబ్ వేదికగా తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ తో గుర్తింపు తెచ్చుకున్న మౌళి తనుజ్ తన కెరీర్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మంచి క్రేజ్ సంపాదించిన మౌళి ఇప్పుడు కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. ఈసారి మౌళి ఒక క్రైమ్ కామెడీ జానర్ సినిమాతో ప్రేక్షకులను అలరించబోతున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుండటం ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాకు మురళి అనే కొత్త దర్శకుడు దర్శకత్వం వహించనున్నారు. మౌళి స్టైల్‌లో ఉండే సహజ హాస్యానికి క్రైమ్ ఎలిమెంట్స్‌ను జోడిస్తూ దర్శకుడు కథను రెడీ చేసినట్లు సమాచారం. కామెడీతో పాటు థ్రిల్, సస్పెన్స్ అంశాలు కూడా ఈ సినిమాలో భాగంగా ఉండబోతున్నాయని తెలుస్తోంది. మౌళి స్క్రీన్ ప్రెజెన్స్‌కు తగ్గట్టుగా కథను తీర్చిదిద్దారని టాక్ వినిపిస్తోంది.



## 13న ప్రైమ్‌లోకి కపుల్ ఫ్రెండ్లీ



టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్, అందాల భామ మానస వారణాసి జంటగా నటించిన క్యూట్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామా మార్చి 13 నుంచి ప్రముఖ ఓటీటీ సంస్థ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ భాషలో కూడా అందుబాటులో ఉండటం విశేషం. వీకెండ్‌లో ప్రశాంతంగా కూర్చుని ఒక మంచి లవ్ స్టోరీ చూడాలనుకునే వారికి 'కపుల్ ఫ్రెండ్లీ' బెస్ట్ ఆప్షన్.

### డారిల్‌కు అర్ష్‌దీప్ క్షమాపణ

# చెప్పనక్కర్లేదు: గంభీర్



న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్‌కు భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తన ఆటగాళ్ల నుంచి తాను ఇలాంటి దూకుడునే కోరుకుంటానని గంభీర్ స్పష్టం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో డారిల్ మిచెల్‌ను అర్ష్‌దీప్ సింగ్ బంతితో కొట్టిన సంగతి తెలిసిందే. వరుసగా రెండు సిక్స్‌లు బాదడంతో సహనం కోల్పోయిన అతను బంతిని బలంగా విసిరాడు. దాంతో డారిల్ మిచెల్ తీవ్ర ఆగ్రహానికి గురవ్వగా.. కెప్టెన్ సూర్య క్షమాపణలు చెప్పి అతన్ని శాంత పర్చాడు. అంపైర్ మందలించడంతో ఓవర్ పూర్తయిన తర్వాత అర్ష్‌దీప్ సింగ్ సారీ చెప్పాడు. మ్యాచ్ అనంతరం కూడా క్షమాపణలు చెబుతూ అతనితో ఇన్‌స్టా రీల్ చేశాడు. ఐసీసీ కూడా అర్ష్‌దీప్ సింగ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కేటాయించింది. తాజాగా ఓ జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఘటనపై మాట్లాడిన గంభీర్.. అర్ష్‌దీప్ సింగ్‌కు అండగా నిలిచాడు. 'అది పెద్ద సమస్య కాదు. దేశం తరఫున ప్రాతినిథ్యం వహించేటప్పుడు దూకుడు చూపించాల్సిన అవసరం ఉంది. బంతిని విసిరితే తప్పేంటి? వరుసగా రెండు సిక్స్‌లు కొట్టించుకోవాలని ఏ బౌలర్ అనుకోడు కదా? ఆ తర్వాత బంతికి అతను అలా చేశాడు. నా ఆటగాళ్ల నుంచి నేను ఇలాంటిదే కోరుకుంటా. అందులో ఎలాంటి తప్పులేదు. ఒకవేళ అతను సారీ చెప్పకపోయినా సరే.. వచ్చే సమస్య ఏం లేదు. క్షమాపణలు చెప్పాల్సిన అసవరం కూడా లేదు. అయితే, సారీ చెప్పి అర్ష్‌దీప్ సింగ్ మంచి పని చేశాడు.

# శ్రేయస్ బాధపడి ఉంటాడు



ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో చోటు దక్కకపోవడంపై శ్రేయస్ అయ్యర్ కచ్చితంగా బాధపడి ఉంటాడని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. శుభ్‌మన్ గిల్ కంటే కూడా అయ్యర్ ఎక్కువ నిరాశకు గురై ఉంటాడని అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ 2026 జట్టులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కని విషయం తెలిసిందే. ఐపీఎల్ 2025 సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినా కూడా భారత టీ20 జట్టులో అతనికి అవకాశం దక్కలేదు. టీమ్ కాంబినేషన్ సెట్ అవ్వడంతోనే అయ్యర్‌కు అవకాశం ఇవ్వలేదని అప్పట్లో సెలెక్టర్లు వివరణ ఇచ్చారు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అపార ప్రతిభ కలిగిన అయ్యర్‌కు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కకపోవడం అతనికి జరిగిన అన్యాయమేనని అభిప్రాయపడ్డాడు. 'శ్రేయస్ అయ్యర్ నాణ్యమైన ఆటగాడు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లి.. 600 పైగా పరుగులు చేసినా అతన్ని వరల్డ్ కప్ టీమ్‌లోకి తీసుకోకపోవడం చాలా బాధాకరం. ఇది అతనికి జరిగిన అన్యాయమే. ఇంత పెద్ద టోర్నీలో భారత జట్టు గెలిచినప్పుడు.. అందులో తను లేకపోవడం ఏ ఆటగాడికైనా జీర్ణించుకోవడం కష్టం. అయ్యర్ కూడా మనసులో ఖచ్చితంగా బాధపడి ఉంటాడు. అయ్యర్ ప్రస్తుతానికి ఓపిక పట్టాలి. అతను టీమ్‌లో ఉండడమే కాదు. భవిష్యత్తులో టీమిండియా కెప్టెన్సీ రేసులో కూడా ఉండే అవకాశం ఉందని నేను నమ్ముతున్నాను.




# దంచుడే దంచుడు!

## ఐపీఎల్ షెడ్యూల్ రిలీజ్.. ఎన్నికల నేపథ్యంలో రెండు విడతలు

### తాజాగా తొలి విడత విడుదల.. తొలి పోరు ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 షెడ్యూల్ విడుదలైంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తొలుత నిర్వాహకులు.. మొదటి 20 మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మేరకు బుధవారం అధికారికంగా ప్రకటన చేశారు. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తలపడనుంది. బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఐపీఎల్ 2026 తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ తలపడతాయని ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. ఆర్సీబీతో.. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు జరుగుతుంది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 దాకా తొలి విడత మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చే నెలలో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక ఐపీఎల్ 2026 పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు ఐపీఎల్ నిర్వాహకులు పేర్కొన్నారు.




**మొదటి 20 మ్యాచ్‌ల షెడ్యూల్..**

- మార్చి 28 - ఆర్సీబీ వర్సెస్ సన్‌రైజర్స్ (బెంగళూరు)
- మార్చి 29 - ముంబై వర్సెస్ కోల్‌కతా (ముంబై)
- మార్చి 30 - రాజస్థాన్ వర్సెస్ సీఎస్కే (గువహటి)
- మార్చి 31 - పంజాబ్ వర్సెస్ గుజరాత్ (న్యూ ఛండీగఢ్)
- ఏప్రిల్ 1 - లక్నో వర్సెస్ ఢిల్లీ (లక్నో)
- ఏప్రిల్ 2 - కోల్‌కతా వర్సెస్ సన్‌రైజర్స్ (కోల్‌కతా)
- ఏప్రిల్ 3 - సీఎస్కే వర్సెస్ పంజాబ్ కింగ్స్ (చెన్నై)
- ఏప్రిల్ 4 - ఢిల్లీ వర్సెస్ ముంబై (ఢిల్లీ)
- ఏప్రిల్ 4 - గుజరాత్ వర్సెస్ రాజస్థాన్ (అహ్మదాబాద్)
- ఏప్రిల్ 5 - సన్‌రైజర్స్ వర్సెస్ లక్నో (హైదరాబాద్)
- ఏప్రిల్ 5 - ఆర్సీబీ వర్సెస్ చెన్నై (బెంగళూరు)
- ఏప్రిల్ 6 - కోల్‌కతా వర్సెస్ పంజాబ్ (కోల్‌కతా)
- ఏప్రిల్ 7 - రాజస్థాన్ వర్సెస్ ముంబై (గువహటి)
- ఏప్రిల్ 8 - ఢిల్లీ వర్సెస్ గుజరాత్ (ఢిల్లీ)
- ఏప్రిల్ 9 - కోల్‌కతా వర్సెస్ లక్నో (కోల్‌కతా)
- ఏప్రిల్ 10 - రాజస్థాన్ వర్సెస్ ఆర్సీబీ (గువహటి)
- ఏప్రిల్ 11 - పంజాబ్ వర్సెస్ సన్‌రైజర్స్ (న్యూ చండీగర్)
- ఏప్రిల్ 11 - సీఎస్కే వర్సెస్ ఢిల్లీ (చెన్నై)
- ఏప్రిల్ 12 - లక్నో వర్సెస్ గుజరాత్ (లక్నో)
- ఏప్రిల్ 12 - ముంబై వర్సెస్ ఆర్సీబీ (ముంబై)



# అభిషేక్ 1, ఇషాన్ 2

**టీ20 ర్యాంకింగ్స్‌లో మనోళ్ల జోరు**

**బౌలింగ్‌లో నం.1గా రషీద్ ఖాన్**

**నం.2కు పడిపోయిన వరుణ్ చక్రవర్తి**



టీ20 ప్రపంచకప్ 2026లో అద్భుత ఫామ్‌ను కొనసాగించిన టీమిండియా యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపారు. తాజా ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇషాన్ రెండు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నారు. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న మరో భారత బ్యాటర్ అభిషేక్ శర్మకు, ఇషాన్‌కు మధ్య కేవలం 4 పాయింట్ల తేడా మాత్రమే ఉండటం గమనార్హం. ప్రపంచకప్‌లో నిలకడగా రాణించిన ఇషాన్ కిషన్ 871 రేటింగ్ పాయింట్లతో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం అభిషేక్ శర్మ 875 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇషాన్ రెండో స్థానంలో నిలిచారు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ చరిత్రలో టాప్-2 స్థానాల్లో ఇద్దరు భారత ఆటగాళ్లు ఉండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 25 బంతుల్లోనే 54 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ టోర్నీలో మొత్తం 317 పరుగులు చేసిన ఇషాన్, తన దూకుడుతో ర్యాంకింగ్స్‌లో పైకి దూసుకొచ్చారు. మరోవైపు, ఫైనల్‌లో 52 పరుగులు చేసిన అభిషేక్ శర్మ తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శామ్సన్ ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకుకు చేరుకున్నారు. ఇతర భారత బ్యాటర్లలో తిలక్ వర్మ 6, సూర్యకుమార్ యాదవ్ 7 ర్యాంకులతో టాప్-10లో కొనసాగుతున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో భారత్‌కు స్వల్ప నిరాశ ఎదురైంది. అగ్రస్థానంలో ఉన్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన నంబర్ వన్ ర్యాంకును కోల్పోయారు. ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ దిగ్గజం రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.

# బీసీసీఐకి మస్తు పైసలున్నయ్: గంగూలీ

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన టీమిండియాపై బీసీసీఐ కనక వర్షం కురిపించింది. రూ.131 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్‌ను ప్రకటించింది. బోర్డు ప్రకటించిన మొత్తంలో ఆటగాళ్లకు ఎంత ఇస్తారనేది అధికారికంగా ప్రకటించకపోయినా.. ఒక్కో ప్లేయర్‌కు రూ. 6 కోట్లు చొప్పున అందజేయనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ భారీ క్యాష్ ప్రైజ్ ప్రకటించడంపై బోర్డు మాజీ ప్రెసిడెంట్ సౌరవ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మంగళవారం కోల్‌కతాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన దాదా.. బోర్డు దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని చెప్పాడు. సంజూ శాంసన్ ప్రదర్శన తనకేం ఆశ్చర్యం కలిగించలేదని తెలిపాడు. కోచ్‌గా గంభీర్.. కెప్టెన్‌గా సూర్య.. ఆటగాళ్లు సమష్టిగా రాణించడంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపాడు.

## సౌతాఫ్రికానే అత్యుత్తమ జట్టు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ విజేతగా నిలిచినా.. టోర్నీ అత్యుత్తమ జట్టు కాదని ఇంగ్లండ్ మాజీ పేసర్ స్టీవ్ హార్మిసన్ అన్నాడు. సెమీస్‌లో ఓడిన సౌతాఫ్రికానే అత్యుత్తమ జట్టు అని అభిప్రాయపడ్డాడు. 'న్యూజిలాండ్ బ్యాటర్ ఫిన్ అలెన్ అద్భుతంగా ఆడిన ఒక మ్యాచ్ మినహా.. ఈ టోర్నీ మొత్తంలో సౌతాఫ్రికానే అత్యంత నిలకడగా రాణించింది. కానీ కీలకమైన సమయంలో చేతులెత్తేసి టోర్నీ నుంచి తప్పుకుంది. మరోవైపు తీవ్ర ఒత్తిడిని తట్టుకొని రాణించడంలో భారత్ ఇతర జట్ల కన్నా మెరుగ్గా నిలిచింది. వైట్‌బాల్ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. సొంతగడ్డపై మ్యాచ్‌లు జరిగేంత కాలం భారత్‌కు తిరుగులేదు. అత్యుత్తమ జట్టు, నైపుణ్యం కలిగిన ఆటగాళ్లు ఉండటంతో పాటు స్వదేశంలో ఆడే అవకాశం వారికి అడ్వాంటేజ్‌గా మారింది. బీసీసీఐ.. ఐసీసీ కన్నా పవర్‌ఫుల్ కనుక.. భారత్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడలేరు.'అని హార్మిసన్ పేర్కొన్నాడు.

# నీకేం నొప్పి

### కీర్తి ఆజాద్‌పై హర్భజన్ సింగ్

భారత మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ విన్నర్ కీర్తి ఆజాద్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. క్రీడల కంటే రాజకీయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్లు తమ విజయాన్ని నచ్చినట్లు సెలెబ్రేట్ చేసుకుంటారని చురకలు అంటించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ విజయానంతరం ట్రోఫీని గంభీర్, జైషా, సూర్య స్టేడియంలోని హనుమాన్ ఆలయంలోకి తీసుకెళ్లి పూజలు చేశారు. అయితే ఈ చర్యను కీర్తి ఆజాద్ తప్పుబట్టాడు. ఇది భారత జట్టుకు అవమానకరమని మండిపడ్డాడు. టీమిండియా ఏమైనా సూర్యకుమార్ యాదవ్, జైషా సొత్తా? అని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. భారత విజయాన్ని ఒక మతానికి అంటగట్టడం ఏంటని ప్రశ్నించాడు. కీర్తి ఆజాద్ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ కామెంట్స్‌పై హర్భజన్ సింగ్ ఘాటుగా స్పందించాడు. గుడికి కాకపోతే చర్చి, మసీదుకు తీసుకెళ్తారు.. కీర్తి ఆజాద్‌కు వచ్చిన సమస్య ఏంటని నిలదీసాడు. 'దీని చుట్టూ రాజకీయాలు చేస్తూ ఆయన (కీర్తి ఆజాద్) ఏం చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. అతని వ్యాఖ్యలు చాలా అసంబద్ధంగా ఉన్నాయి. భారత జట్టు ఆ ట్రోఫీని గుడికి కాకపోతే చర్చి, మసీదు కూడా తీసుకెళ్లవచ్చు. అది వారి ఇష్టం. ఒకవేళ వాళ్లు తమ దేవుడిని ఏదైనా కోరుకుని, ఆ కోరిక తీరిన తర్వాత తమ నమ్మకం ప్రకారం అక్కడికి వెళ్తే అందులో తప్పేముంది? తోటి క్రికెటర్ల నుంచి ఇలాంటి మాటలు వినడం చాలా దురదృష్టకరం.



# సన్‌రైజర్స్ షెడ్యూల్ ఇదే!

ఐపీఎల్ 2026 సీజన్ షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అధికారికంగా ప్రకటించింది. పలు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌నే వెల్లడించింది. మార్చి 28 నుంచి ఈ ధనాధన్ లీగ్ మొదలవ్వనుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం అసెంబ్లీ ఎన్నికల తేదీలు ఖరారైన తర్వాత మిగతా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని బీసీసీఐ తమ ప్రకటనలో పేర్కొంది. ఈ తొలి దశ షెడ్యూల్ ప్రకారం.. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 20 మ్యాచ్‌లు 10 వేదికల్లో జరగనున్నాయి. ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో మూడు మ్యాచ్‌లు ఇతర జట్ల వేదికల్లో ఆడనుండగా.. ఒకే ఒక్క మ్యాచ్ హైదరాబాద్ వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. మార్చి 28న జరిగే తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగే మ్యాచ్‌తో మన సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్)తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. అయితే చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఆర్‌సీబీతో తొలి మ్యాచ్ ఆడనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. కోల్‌కతాతో ఏప్రిల్2న, లక్నో సూపర్ జెయింట్స్ ఏప్రిల్ 3న, ఏప్రిల్ 11న పంజాబ్ కింగ్స్‌తో ఆడనుంది. హైదరాబాద్ వేదికగా లక్నోతో జరిగే మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం కానుంది. పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్ కూడా మధ్యాహ్నం 3.30 గంటలకు జరగనుంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్**

మార్చి 28: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (రాత్రి 7:30, బెంగళూరు)

ఏప్రిల్ 02: కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (రాత్రి 7:30, కోల్‌కతా)

ఏప్రిల్ 05: సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ (మధ్యాహ్నం 3:30, హైదరాబాద్) – హోమ్ మ్యాచ్


ఏప్రిల్ 11: పంజాబ్ కింగ్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (మధ్యాహ్నం 3:30, న్యూ చండీగఢ్)

ఈవార్తలు ప్రజావాణి
గురువారం 12-3-2026
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# జపాన్ 'వ్యూహాత్మక' అడుగు

అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్న వేళ, తన వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాలన్న జపాన్ నిర్ణయం ప్రపంచ ఆర్థిక గమనంలో ఒక కీలక పరిణామం. ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు సరఫరా వ్యవస్థ అతలాకుతలమవుతుందన్న ఆందోళనల మధ్య, టోక్యో తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం కేవలం ఆ దేశానికే పరిమితం కాకుండా గ్లోబల్ మార్కెట్‌పై ప్రభావం చూపనుంది. సహజ వనరులు తక్కువగా ఉండి, దాదాపు 90% చమురు అవసరాల కోసం దిగుమతులపైనే ఆధారపడే జపాన్ వంటి దేశానికి 'వ్యూహాత్మక నిల్వలు' ఒక రక్షణ కవచం వంటివి. యుద్ధ మేఘాలు కమ్ముకున్న తరుణంలో, సరఫరా గొలుసు దెబ్బతింటే దేశీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూల కుండా చూసుకోవడం ఈ చర్య వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. చమురు ధరలు ఆకాశాన్ని తాకితే, అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారం అవుతాయి. జపాన్ తన నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ కొరతను తగ్గించి, ధరలను నియంత్రణలోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇది పెట్టుబడిదారులలో మరియు వినియోగదారులలో భరోసాను నింపుతుంది. సాధారణంగా ఇలాంటి నిర్ణయాలు ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా జరుగుతాయి. జపాన్ తన నిల్వలను వాడటం ప్రారంభించిందంటే, అది ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు కూడా ఒక సంకేతం. అమెరికా, భారత్ వంటి దేశాలు కూడా ఇదే బాటలో నడిస్తే, చమురు ఉత్పత్తి దేశాల (ఒపెక్) గుత్తాధిపత్యానికి కొంత అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. అయితే, నిల్వల విడుదల అనేది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. శాశ్వత పరిష్కారం కావాలంటే పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలి లేదా పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రపంచం వేగంగా అడుగులు వేయాలి. ప్రస్తుతానికి మాత్రం, జపాన్ తీసుకున్న ఈ 'వ్యూహాత్మక' నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపిరిపోసే చర్యగానే భావించాలి.




తెలంగాణ గడ్డపై ఇప్పుడు పాలనకూ, ప్రజా ఆకాంక్షలకూ మధ్య పెద్ద అగాథం కనిపిస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యాంగ ప్రతిని పట్టుకుని తిరిగే కాంగ్రెస్ నేతలు, రాష్ట్రంలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం వెలుగుమట్ల ఘటనలో వందలాది నిరుపేద కుటుంబాలను నిర్దాక్షిణ్యంగా రోడ్డున పడేయడం ప్రభుత్వ మొండివైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది. 'ప్రజా పాలన' అని పేరు పెట్టి, ప్రజా కంఠాన్ని నొక్కేసే ప్రయత్నం సాగుతోంది.

# తెలంగాణలో మరో 'దండి' యాత్ర



నవీన్ పోగుల
98854 43909
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

రైతు భరోసా చెల్లింపుల్లో జాప్యం, మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం ప్రజల్లో అసహనాన్ని పెంచుతున్నాయి. పాలకుల అణచివేత ధోరణి మితిమీరినప్పుడు, సామాన్యుడి గొంతుక వినిపించడానికి మరో శాంతియుత పోరాటం, మరో 'దండి యాత్ర' ఆవశ్యకత ఏర్పడుతోంది. ప్రభుత్వం తన తప్పులను దిద్దుకోకపోతే, తెలంగాణ సమాజం తిరగబడే రోజు దగ్గర్లోనే ఉంది. ఆనాడు ఉప్పుపై బ్రిటిష్ ప్రభుత్వం విధించిన అన్యాయమైన పన్నులకు వ్యతిరేకంగా గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం చేశారు. నేడు తెలంగాణలో ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్ణయాలకు, ముఖ్యంగా గూడు కోల్పోయిన పేదల ఆవేదనకు వ్యతిరేకంగా ప్రజలు గొంతు ఎత్తుతున్నారు. దండియాత్ర కేవలం ఒక నడక కాదు, అది నైతిక శక్తికి, అధికార గర్వానికి మధ్య జరిగిన పోరు. నేడు తెలంగాణలో అధికారపక్షం చేస్తున్న కూల్చివేతలు కూడా రాజ్యాంగ విరుద్ధం. దానిపై పోరు అవసరం. గాంధీజీ పిలుపుతో యావత్ భారతం ఎలాగైతే కదంతొక్కిందో, నేడు తెలంగాణలో కూడా మహిళలు, రైతులు తమ హక్కుల కోసం స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. బ్రిటిషర్లు సత్యాగ్రహులను ఎలాగైతే నిర్బంధించారో, నేడు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను, బాధితులను పోలీసులు అరెస్టు చేయడం ఆనాటి అణచివేతను గుర్తు చేస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న పరిస్థితులు పాలకులు తమ వైఖరిని మార్చుకోకపోతే, ప్రజలే స్వయంగా ఒక గొప్ప ఉద్యమానికి శ్రీకారం చుట్టే దిశగా ముందడుగు వేస్తారు. శతకోటి ఆవేదనలు సమ్మెట దెబ్బలైతేనే ఉద్యమం ఉద్భవిస్తుంది. తెలంగాణ ప్రస్తుత సామాజిక, రాజకీయ ముఖచిత్రం గమనిస్తే 'ప్రజా పాలన' నినాదానికి భిన్నంగా వెళ్తోంది. ఆ అసహనమే మరో ప్రజా ఉద్యమానికి నాంది పలుకుతుంది. తెలంగాణ గడ్డకు పోరాటం కొత్త కాదు. అది స్వరాష్ట్ర సాధనకైనా, హక్కుల రక్షణకైనా ఇక్కడి ప్రజలు ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. అయితే, దశాబ్ద కాలం తర్వాత మళ్ళీ అటువంటి ఒక ఉద్వేగపూరిత వాతావరణం కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకోవడం ఆశ్చర్యకరం. హామీల అమలులో జాప్యం, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను పట్టించుకోకపోవడం పాలకుల వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల సామాన్యుడు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, రాజకీయ పార్టీల పిలుపుతో సంబంధం లేకుండా ప్రజలే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారు. ముఖ్యంగా పేదల ఇళ్ల కూల్చివేతలు, రైతులకు అందుతున్న అరకొర సాయం ప్రజల్లో ఒక రకమైన 'అభద్రతా భావాన్ని' పెంచుతున్నాయి. ఈ అభద్రతే నేడు ఐక్యతకు దారితీస్తోంది. చరిత్ర సాక్షిగా ఏ ప్రభుత్వమైనా ప్రజల ఆకాంక్షలను కాలరాస్తే, వారు తిరగబడటం ఖాయం. తెలంగాణలో మళ్లీ అలాంటి 'ప్రజా చైతన్య యాత్ర' మొదలైంది. చెరువుల పరిరక్షణ మంచిదే అయినా, ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను హైడ్రా కూల్చివేయడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాల్లో బాధితులు తమ ఆవేదనను పోరాట రూపంలోకి మారుస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి హామీలు ఆశించిన స్థాయిలో వేగంగా అమలు కాకపోవడం. అర్హులైన లబ్ధిదారులు ఇంకా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం ప్రజల ఆగ్రహానికి కారణమవుతోంది. రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తిగా జరగలేదని, నిబంధనల పేరుతో లక్షలాది మంది రైతులను జాబితా నుండి తొలగించారని రైతాంగం ఆగ్రహంతో ఉంది. నిరసన తెలిపే బాధితులను, విపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం, పోలీసు బలగాలతో ధర్నాలను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలపై దాడే కదా. నోటిఫికేషన్లు, ఫలితాల విడుదల, వయోపరిమితి వంటి అంశాల్లో ప్రభుత్వంపై ఉన్న అంచనాలు అందకపోవడంతో యువత మళ్ళీ ఉద్యమ బాట పడుతోంది.



# 15 ఏళ్ల.. జ'గ'న్ ప్రస్థాన్

మార్చి 12, 2011న ఆవిర్భవించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురువారం 15వ వసంతంలోకి అడుగుపెడుతోంది. ఒక వ్యక్తి పట్టుదల, లక్షలాది మంది కార్యకర్తల నమ్మకం ఒక ప్రాంతీయ పార్టీని జాతీయ స్థాయిలో ఏ విధంగా నిలబెట్టగలవో చెప్పడానికి వైసీపీ ప్రస్థానమే నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి, సొంత గడ్డపై ఆత్మాభిమానం కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ పార్టీని స్థాపించారు. రాజశేఖర్ రెడ్డి మరణానంతర పరిణామాల్లో ఎదురైన రాజకీయ కుట్రలను, జైలు శిక్షలను ఎదిరించి నిలబడటమే ఈ పార్టీ తొలి విజయం. 2012 ఉప ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మొదటి ఎన్నికల్లో కేవలం 67 స్థానాలకు పరిమితమై అధికారానికి దూరమైంది. 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర తర్వాత, 'రావాలి జగన్ - కావాలి జగన్' నినాదంతో 151 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. పరిపాలనలో సంక్షేమానికి పెద్దపీట వేసినా, 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయింది. పరాజయాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, మళ్ళీ ప్రజల్లోకి వెళ్లడమే వైసీపీ నైజం. ప్రజల కష్టాల నుంచే పుట్టిన పార్టీ అని చెప్పుకునే వైసీపీ, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి ప్రజల గొంతుకగా పోరాడుతోంది. సంక్షేమ పథకాల ద్వారా పేదవాడి గుండెల్లో సంపాదించుకున్న స్థానమే ఈ పార్టీకి శ్రీరామరక్ష. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడటమే అసలైన రాజకీయం. వైసీపీ తన 15 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో పాఠాలు నేర్చుకుంది. ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొంటూ, 2029 లక్ష్యంగా మళ్లీ పుంజుకోవడమే వైసీపీ ముందున్న ప్రధాన లక్ష్యం.

- రాజశేఖర్ నెక్కొండ, కడప

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం, మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.